గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సి ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.

# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక




హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 249, ఎడిటర్,భీముడు నాయక్ పేజీలు : 12, వెల రూ. 1, శనివారం - 19 - అక్టోబర్ - 2024
PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## షెడ్యూల్ ప్రకారమే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు..
### పిటిషన్లను కొట్టేసిన హైకోర్టు

సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థించింది

ప్రాథమిక కీలో తప్పులున్నాయనే పిటిషన్‌పై డివిజన్ బెంచ్ తీర్పు



2

## రేసులో పలువురి పేర్లు

హమాస్ చీఫ్ సిన్వార్ స్థానాన్ని చేపట్టేదెవరు..?

అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడిలో ప్రధాన వ్యూహకర్తగా వ్యవహరించిన ఆ మిలిటెంట్ గ్రూప్ అధినేత యహ్యా సిన్వార్ ను ఐడీఎఫ్ మట్టుబెట్టింది



2

## మరోసారి రష్యాలో పర్యటించనున్న ప్రధాని మోడీ

అక్టోబర్ 22-23 తేదీలలో కజాన్‌లో నిర్వహించే 16వ బ్రిక్స్ సమ్మిట్‌కి ఆహ్వానిస్తూ గత నెల రష్యా అధ్యక్షుడు పుతిన్ నుండి లేఖ

ప్రపంచ సమస్యలను చర్చించడానికి దేశాధినేతలకు ఓ ముఖ్యమైన వేదిక కానుంది





## "మూసీ అనేది.. కృష్ణానదికి ఉపనది. మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్..

- మూసీ విషయంలో రోజుకో మాట
- సీఎం రేవంత్‌రెడ్డిపై విరుచుకుపడిన కేటీఆర్
- "మూసీ కోసం చేపట్టిన లక్షన్న కోట్ల కుంభకోణాన్ని అందరూ గమనిస్తున్నారు
- నల్గొండ ప్రజలను రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నారు"

## తెలంగాణ కేబినెట్ భేటీకి
# ముహూర్తం ఫిక్స్

- అక్టోబర్ 23న తెలంగాణ కేబినెట్ భేటీ
- భేటీలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశం
- హైడ్రాకు చట్టబద్ధత, రైతు భరోసా, రుణమాఫీ, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ వంటి అంశాలు చర్చ
- సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సాయంత్రం 4 గంటలకు కేబినెట్ భేటీ
- మున్సిపల్ యాక్ట్ చట్ట సవరణ బిల్లుపై కేబినెట్ లో చర్చించే అవకాశం



వివరాలు 2లో..

హైదరాబాద్: తెలంగాణ కేబినెట్ భేటీకి ముహూర్తం ఫిక్స్ అయింది. ఈనెల 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశం కానుంది. ఈ భేటీలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. హైడ్రాకు చట్టబద్ధత, రైతు భరోసా, రుణమాఫీ, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ వంటి అంశాలు చర్చకు రానున్నాయి. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సాయంత్రం 4 గంటలకు కేబినెట్ భేటీ జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం ప్రకటన జారీ చేశారు. మంత్రివర్గ సమావేశంలో కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉంది. హైడ్రాకు చట్టబద్ధతతో పాటు అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై చర్చించనున్నారు. జీహెచ్ఎంసీ అధికారాలు ఇటీవలనే హైడ్రాకు కట్టబెడుతూ పురపాలకశాఖ ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ యాక్ట్ చట్ట సవరణ బిల్లుపై

### మూసీ నీళ్లతో స్నానం చేసేలా...
## తాగేలా బాగు చేస్తాం



2లో

స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.2 లక్షలు ఇస్తున్నామన్న సీతక్క

172 స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.3.44 కోట్ల రుణాలు ఇస్తున్నట్లు వెల్లడి

ఇందులో రూ.1.4 లక్షలు ఉచితంగా ఇస్తున్నామన్న మంత్రి

మనం జీవించే పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి

## మూసీ సుందరీకరణపై కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్: నగరంలో మూసీ సుందరీకరణ అంశంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పేదల ఇల్లు కూల్చకుండా మూసీ సుందరీకరణ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. అలాగే, మూసీ నదిలో డ్రైనేజీలు కలవకుండా చూడాలన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ..'మూసీ సుందరీకరణ చేసినా పునర్జీవం చేసినా మేం వ్యతిరేకం కాదు. మూసీకి రెండు వైపులా రిటైనింగ్ వాల్ కట్టండి. డ్రైనేజీ మూసీలో కలవకుండా చూడండి. పేదల ఇల్లు కూల్చకుండా మూసీ సుందరీకరణ చేయవచ్చు. ఆ తర్వాత మూసీ పునర్జీవం చేయండి. రాష్ట్రంలో గ్రూప్-1 అభ్యర్థుల న్యాయ బద్ధమైన సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నా. తెలంగాణ సమాజానికి బీఆర్ఎస్ వ్యతిరేకం. కేసీఆర్ కుటుంబంపై తెలంగాణలో ఇంకా వ్యతిరేకత ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సీట్లే ఇవ్వలేదు అంటూ కామెంట్స్ చేశారు.



2లో

## భాగమతి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో కుట్రకోణం?

- రైలు ప్రమాదానికి రైల్వే ఉద్యోగులేనన్న అనుమానాలు
- విచారణలో ప్రమాద ప్రాంతంలో స్విచ్ పాయింట్ల బోల్టులు తొలగించినట్లు అధికారులు గుర్తింపు
- లూప్ లైన్‌లో పట్టాలు ట్రాక్‌గా మారే చోట బోల్ట్‌నట్ విప్పడంతో గూడ్స్ ట్రాక్ మారింది

### న్యాయం గెలిచిందంట...
# మరి వీటి సంగతేంటి?

చంద్రబాబుపై జగన్ విమర్శనాస్త్రాలు

తాడేపల్లిలో జగన్ మీడియా సమావేశం

ఇటీవల స్కిల్ కేసులో ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

చంద్రబాబుకు ఈడీ క్లీన్ చిట్ ఇచ్చిందంటూ టీడీపీ ట్వీట్

తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన జగన్

చంద్రబాబుకు, టీడీపీకి, కొన్ని మీడియా సంస్థలకు ప్రశ్నల వర్షం



అమరావతి: వైసీపీ అధినేత జగన్ తాడేపల్లిలో మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు పైనా, తెలుగుదేశం పార్టీ పైనా, కొన్ని మీడియా సంస్థల పైనా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇటీవల ఈడీ స్కిల్ డెవలప్ మెంట్ కేసులో కొందరి ఆస్తులు అటాచ్ చేయగా... న్యాయం గెలిచిందంటూ టీడీపీ ట్వీట్ చేసింది. మిగతా..2లో



2లో

## ఈ నెల 23న ఏపీ కేబినెట్ భేటీ..

- కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం
- సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై కేబినెట్ చర్చ
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం కూడా ప్రారంభించే యోచనలో ప్రభుత్వం
- దేవాదాయ శాఖకు సంబంధించి కూడా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం

## ఇలాంటి పరిస్థితులను
# గతంలో ఎప్పుడూ చూడలేదు

- మంగళగిరిలో టీడీపీ ప్రజాప్రతినిధుల సమావేశం
- టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు చంద్రబాబు దిశానిర్దేశం
- పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉండాలని స్పష్టీకరణ
- కార్యకర్త తప్పు చేసినా ఆ ప్రభావం సీఎంపైనా, పార్టీపైనా పడుతుందని వెల్లడి



అమరావతి: తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం నిర్వహించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో టీడీపీ ప్రజాప్రతినిధులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వ విజయాలు, టీడీపీ సభ్యత్వ నమోదు, పంచాయతీరాజ్ వ్యవస్థలు, సూపర్ సిక్స్, పల్లె పండుగ, సహా 8 అంశాలపై చర్చించారు. ప్రత్యేకంగా, లోక్ సభ స్థానాల పరిధిలోని సమస్యలను ఎంపీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ... గత ఐదేళ్లలో జగన్ అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారని వ్యాఖ్యానించారు. ఏ వ్యవస్థ కూడా సజావుగా పనిచేస్తోంది అనుకోవడానికి లేకుండా విధ్వంసం చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కూడా దారిమళ్లించారని ఆరోపించారు. గతంలో ఎప్పుడూ కూడా ఇలాంటి పరిస్థితులను మిగతా..2లో



## 'సూపర్ సిక్స్'పై కసరత్తు
### నవంబరు రెండో వారంలో ఏపీ బడ్జెట్!

రూ.2.90 లక్షల కోట్ల అంచనాతో పద్దువరుస సమావేశాలతో ఆర్థికశాఖ బిజీ

అమరావతి: రాష్ట్ర పూర్తి స్థాయి బడ్జెట్‌ను నవంబరు రెండో వారంలో ప్రవేశపెట్టనున్నారు. ఆర్థికశాఖ అధికారులు బడ్జెట్ రూపకల్పనలో తలమునకలై ఉండగా.. శాసనసభ, ఆర్థిక వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఆర్థిక శాఖ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే రెండు, మూడు తేదీలు ప్రతిపాదనకు వచ్చాయి. రాష్ట్రంలో ఎన్నికల దృష్ట్యా జగన్ ప్రభుత్వం ఫిబ్రవరి నెలలో ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌ను సమర్పించింది. మొత్తం రూ.2,86,389 కోట్లకు బడ్జెట్ సమర్పించారు. 2024 ఏప్రిల్ నుంచి జులై 31 వరకు నాలుగు నెలల మిగతా..2లో

## షెడ్యూల్ ప్రకారమే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు..

హైదరాబాద్ : గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. దీంతో షెడ్యూల్ ప్రకారమే ఈ నెల 21 నుంచి యథావిధిగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను నిర్వహించనున్నారు. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థించింది. ప్రాథమిక కీలో తప్పులున్నాయనే పిటిషన్‌పై డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చింది. గ్రూప్-1 పరీక్షలపై దాఖలైన పిటిషన్లన్నింటినీ హైకోర్టు కొట్టి వేసింది. ఇక అశోక్ నగర్‌లో మళ్లీ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. గ్రూప్-1 పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలని ఆందోళనకు దిగిన అభ్యర్థులపై పోలీసులు లాఠీలు ఝులిపించారు. పోలీసుల దాడుల్లో పలువురు అభ్యర్థులకు తీవ్ర గాయాలయ్యాయి. జీవో 29 రద్దు చేసేంత వరకు తమ పోరాటం ఆగదని అభ్యర్థులు తేల్చిచెప్పారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో అశోక్ నగర్ దద్దరిల్లిపోతోంది.

# రేసులో పలువురి పేర్లు

ఇజ్రాయెల్: ఇజ్రాయెల్‌తో పోరులో హమాస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలిన విషయం తెలిసిందే. గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడిలో ప్రధాన వ్యూహకర్తగా వ్యవహరించిన ఆ మిలిటెంట్ గ్రూప్ అధినేత యహ్యా సిన్వార్ ను ఐడీఎఫ్ మట్టుబెట్టింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ధ్రువీకరించింది. గాజాలోని రఫా పట్టణంపై ఐడీఎఫ్ ఈ నెల 7న చేసిన దాడిలో సిన్వార్ హతమైనట్టు ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ మంత్రి కట్జ్ గురువారం నిర్ధారించారు. యహ్యా సిన్వార్.. హమాస్ మిలిటరీ విభాగంలో కీలక వ్యక్తిగా ఎదిగారు. ఐడీఎఫ్ దాడుల్లో సిన్వార్ మృతి చెందడం ఆ గ్రూప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లైంది. ఇప్పుడు ఆ మిలిటెంట్ గ్రూప్‌ను ముందుండి నడిపించేది వెరన్నదానిపై విస్తృతంగా చర్చ నడుస్తోంది . రేసులో పలువురు ఉన్నత స్థాయి నేతల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఇందులో హమాస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన మహమ్మద్ అల్ జహర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన హమాస్ గ్రూప్‌ను ముందుండి నడిపిస్తాడని వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో సిన్వార్ సోదరుడు మహమ్మద్ సిన్వార్ పేరు సైతం ప్రచారంలో ఉంది. హమాస్ పొలిటికల్ బ్యూరో సీనియర్ సభ్యుడు మౌసా అబు మార్జౌక్, హమాస్ మిలిటరీ వింగ్ కమాండర్ మొహమ్మద్ దీఫ్, హమాస్ పొలిటికల్ బ్యూరో ఖలీల్ అల్ హయ్యా, ఖలేద్ మషాల్ సహా పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నాయి.

ఎవరీ సిన్వార్?

1962లో జన్మించిన సిన్వార్ గాజాలోని ఇస్లామిక్ యూనివర్సిటీ ఆందోళనల్లో పాల్గొనడంతో ఇజ్రాయెల్ 1980లో అరెస్ట్ చేసింది. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఇజ్రాయెల్‌పై పోరాటానికి ఆయుధాల ప్రయోగంలో శిక్షణ పొందిన వారిని నియమించి ఒక సంస్థను స్థాపించాడు. కాసమ్ బ్రిగేడ్స్‌గా పేరొందిన ఆ గ్రూప్ తర్వాత హమాస్ మిలటరీ వింగ్‌గా మారింది. అనంతరం అతడిని అరెస్ట్ చేసిన ఇజ్రాయెల్ 426 ఏండ్ల జైలు శిక్ష విధించింది. 23 ఏండ్లు అతను ఇజ్రాయెల్ జైలులో గడిపాడు. 2011లో ఖైదీల ఒప్పందంతో విడుదలయ్యాడు. 2014లో హమాస్‌లో ప్రధాన నేతగా ఎదిగాడు. గత ఏడాది అక్టోబర్ 7 దాడిలో ప్రధాన పాత్ర పోషించాడు.

అక్టోబర్ 7 దాడులకు సూత్రధారి

గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడిలో సిన్వార్ ప్రధాన వ్యూహకర్తగా వ్యవహరించారు. అప్పటి నుంచి ఇజ్రాయెల్ వాంటెడ్ లిస్టులో ఉన్న సిన్వార్ జాడను కనిపెట్టడం ఇజ్రాయెల్‌కు కష్టతరంగా మారింది. గాజాలో నిర్మించిన సొరంగాల్లో ఆయన ఎక్కువగా ఉండేవారు. ఇదే క్రమంలో అప్పటివరకు హమాస్ చీఫ్‌గా ఉన్న ఇస్మాయిల్ హనియా ఇరాన్‌లోని టెహ్రాన్‌లో ఉండగా, ఆగస్టులో ఇజ్రాయెల్ మట్టుబెట్టడంతో ఆయన స్థానాన్ని సిన్వార్ స్వీకరించారు.

## మరోసారి రష్యాలో పర్యటించనున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ మరోసారి రష్యాలో పర్యటించనున్నారు. అక్టోబర్ 22-23 తేదీలలో కజాన్‌లో నిర్వహించే 16వ బ్రిక్స్ సమ్మిట్‌కి ఆహ్వానిస్తూ గత నెల రష్యా అధ్యక్షుడు పుతిన్ నుండి లేఖ వచ్చినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) శుక్రవారం పేర్కొంది. ప్రపంచ అభివృద్ధి, భద్రత కోసం బహుపాక్షికతను బలోపేతం చేయడం లక్ష్యంతో జరిగే ఈ సమ్మిట్ కీలకమైన ప్రపంచ సమస్యలను చర్చించడానికి దేశాధినేతలకు ఓ ముఖ్యమైన వేదిక కానుందని ఎంఇఎ ఓ ప్రకటనలో పేర్కొంది. బ్రిక్స్ ప్రారంభించిన కార్యక్రమాల పురోగతిని అంచనా వేయడానికి, భవిష్యత్ సహకారం కోసం అనువైన ప్రాంతాలను గుర్తించడానికి సదస్సు విలువైన అవకాశాన్ని అందిస్తుందని తెలిపింది. 22వ భారత్ -రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఈ ఏడాది జులైలో ప్రధాని మోడీ రష్యాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు.

# ఈ నెల 23న ఏపీ కేబినెట్ భేటీ..

అమరావతి: ఈ నెల 23న ఏపీ కేబినెట్ భేటీ కానుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన.. సెక్రటేరియట్‌లో ఈ నెల 23న ఉదయం 11 గంటలకు కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ మంత్రివర్గ సమావేశంలో కీలక చర్చలు సాగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై కేబినెట్ చర్చించనుంది. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేయనున్నట్టు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. అలాగే దీపావళి తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం కూడా ప్రారంభించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. దేవాదాయ శాఖకు సంబంధించి కూడా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలోని వివిధ దేవాలయాలకు పాలక మండళ్ల నియామకంలో చట్ట సవరణ విషయమై ప్రతిపాదన సహా ఇతర అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో రుణాల రీ షెడ్యూల్‌కు సంబంధించి స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపు, చెత్త పన్ను రద్దు, 13 కొత్త మున్సిపాల్టీల్లో 190 కొత్త పోస్టుల భర్తీ ప్రతిపాదనపై కూడా మంత్రివర్గం చర్చించే ఛాన్స్ ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ నెల 23న జరిగే కేబినెట్ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.

### మూసీ నీళ్లతో స్నానం చేసేలా...

# తాగేలా బాగు చేస్తాం

హైదరాబాద్: మూసీ నీళ్లతో స్నానం చేసేలా, తాగేలా తాము బాగు చేస్తామని మంత్రి సీతక్క అన్నారు. మూసీ పరీవాహక స్వయం సహాయ సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చెక్కులను సీతక్క పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మూసీ నది ప్రక్షాళనపై ప్రతిపక్షాల నుంచి వస్తోన్న విమర్శలపై స్పందించారు. మూసీ పరీవాహక స్వయం సహాయ సంఘాల మహిళలకు తాము చేయూతనిస్తున్నామన్నారు. 172 స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.3.44 కోట్ల రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. మనం జీవించే పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అందుకే మూసీ ప్రక్షాళన చేపట్టామన్నారు. మూసీ నిర్వాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్నారు. మూసీ నిర్వాసితుల్లోని ఒక్కో మహిళకు రూ.2 లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో రూ.1.4 లక్షలు ఉచితంగా ఇస్తున్నామని, మిగతా మొత్తం నెలకు రూ.2 వేలు మూడేళ్ల పాటు చెల్లించాలన్నారు.

## భాగమతి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో కుట్రకోణం?

చెన్నై: భాగమతి ఎక్స్‌ప్రెస్ ప్రమాదం వెనక కుట్రకోణం ఉందనే అనుమానాలు పెరిగిపోతున్నాయి. శుక్రవారం ఎన్ఐఏ, రైల్వే అధికారులు విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. రైలు ప్రమాదానికి రైల్వే ఉద్యోగులేనన్న అనుమానాలు వస్తున్నాయి. విచారణలో ప్రమాద ప్రాంతంలో స్విచ్ పాయింట్ల బోల్టులు తొలగించినట్లు అధికారులు గుర్తించారు. లూప్ లైన్‌లో పట్టాలు ట్రాక్‌గా మారే చోట బోల్ట్‌నట్ విప్పడంతో గూడ్స్ ట్రాక్ మారింది. దీంతో గూడ్స్ ట్రైన్‌ను భాగమతి ఎక్స్ ప్రెస్ ఢీకొట్టినట్లు అధికారులు చెబుతున్నారు. 20 మందికి పైగా రైల్వే సిబ్బంది, అధికారులను సౌత్‌జోన్ రైల్వే సేఫ్టీ కమిషనర్ చౌదరి ప్రశ్నించారు. బోల్ట్ విప్పింది బయటి వ్యక్తులు కాదని, రైల్వే ఉద్యోగులేనని ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలుస్తోంది. ఎందుకు అలా చేయాల్సి వచ్చిందనే దానిపై విచారణ కొనసాగుతుంది. దాని వెనుక కుట్రకోణంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు అధికారులు. కాగా, గత శుక్రవారం (అక్టోబర్ 11)న రాత్రి 8.27 సమయంలో తమిళనాడులో భారీ రైలు ప్రమాదం చోటుచేసుకుంది. మైసూరు నుంచి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మీదుగా దర్భాంగ వెళ్లాల్సిన భాగమతి ఎక్స్‌ప్రెస్ (12578) రైలు పొన్నేరి స్టేషన్ దాటింది. తిరువళ్లూరు జిల్లా కవరైపెట్టై రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ రైలును ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. కవరైపెట్టై స్టేషన్‌కు వస్తున్న సమయంలో ఆ రైలు ప్రధాన లైనుపై నుంచి కాకుండా లూప్‌లైన్‌లోకి వెళ్లడం, ఆ లైన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలును ఢీకొట్టడం క్షణాల్లో జరిగిపోయాయి.ఈ ప్రమాదంలో 13 వరకు కోచ్‌లు పట్టాలు తప్పాయి. పార్సిల్ వ్యానులో మంటలు చెలరేగాయి. రైలు ప్రమాదంపై సమాచారం అందుకున్న రైల్వే ఉన్నతాధికారులు,ఎన్ఐఏ అధికారులు విచారణ చేపట్టారు. తాజాగా జరిగిన విచారణలో భాగమతి ఎక్స్‌ప్రెస్ ప్రమాదంపై కుట్రకోణం ఉందని సమాచారం. దీనిపై మరింత పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## తెలంగాణ కేబినెట్ భేటీకి ముహూర్తం ఫిక్స్

మొదటి పేజి తరువాయి



ఈ నేపథ్యంలో మున్సిపల్ యాక్ట్ చట్ట సవరణ బిల్లుపై కేబినెట్ లో చర్చించే అవకాశం ఉంది. ఇక వచ్చే అసెంబ్లీ సమావేశాల నిర్వహణతో పాటు చర్చించే అంశాలపై కూడా సమాలోచనలు చేయనున్నారు. ఇవే కాకుండా ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులతో పాటు కుల గణన వంటి అంశాలపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనను సీరియస్ గా తీసుకుంది. పరివాహన ప్రాంతంలో ఉన్న నిర్వాసితులకు ఇళ్లను కేటాయించే పనిలో పడింది. ఇప్పటికే చాలా ఇళ్లకు మార్కింగ్ కూడా చేసింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుగా మూసీ సుందరీకరణను తీసుకుంది. ఈ నేపథ్యంలో కేబినెట్ భేటీలో ఈ విషయంపై లోతుగా చర్చ జరిగే అవకాశం ఉంది. ఇక రాష్ట్రంలో చాలా మంది రైతులు పంట పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇందుకోసం తీసుకొచ్చిన రైతు భరోసా స్కీమ్ పై కేబినెట్ చర్చించనుంది. విధివిధానాలను ఖరారు చేసే అంశంపై సమాలోచనలు చేయనుంది. ఇక రుణమాఫీ స్కీమ్ కూడా చర్చకు రానుంది. ఈ నెలాఖారులోపు మిగిలిపోయిన రైతులకు కూడా రుణమాఫీ స్కీమ్ వర్తింపజేస్తామని ప్రభుత్వం చెబుతోంది. దీనిపై కూడా కీలకంగా చర్చించే అవకాశం ఉంది.

## “మూసీ అనేది.. కృష్ణానదికి ఉపనది. మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్..



హైదరాబాద్: మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్ అంటూ సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఆయన ఏమన్నారంటే.. “మూసీ కోసం చేపట్టిన లక్షన్న కోట్ల కుంభకోణాన్ని అందరూ గమనిస్తున్నారు. ప్రజెంటేషన్ పేరుతో సీఎం పరువు తీసుకున్నారు. చేయని సర్వేని చేసినట్లు చెప్పుకుంటున్నారు. ఢిల్లీకి మూటలు పంపేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టారు” అని కేటీఆర్ అన్నారు. “మూసీ సుందరీకరణ పదం వాడిందే రేవంత్ రెడ్డి. ఇవాళ అపరిచితుడిలా మారారు. ఆ మాట ఎక్కడి నుంచి వచ్చింది అని అడుగుతున్నారు. లక్షన్నర కోట్లు అన్నదే రేవంత్ రెడ్డి. మూసీ విషయంలో రోజుకో మాట మాట్లాడుతున్నారు. సుందరీకరణ, ప్రక్షాళన, పునరుజ్జీవం, నల్గొండకు మంచినీళ్లు అంటారు. ఇలా నల్గొండ ప్రజలను రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నారు” అని కేటీఆర్ అన్నారు. “మూసీ అనేది.. కృష్ణానదికి ఉపనది. వికారాబాద్.. అనంతగిరి కొండల్లో పుడుతుంది. మూసీ నది మంచి నీటిని నిల్వ ఉంచేందుకు 1920 నాటికి ఉస్మాన్ సాగర్, 1927 నాటికి హిమాయత్ సాగర్ నిర్మించారు. ఆ తర్వాత 95 ఏళ్లపాటూ.. మూసీకి సంబధించి ఏ ప్రభుత్వమూ గొప్పగా పనిచేసింది లేదు. చాలా ముందుచూపుతో మీరు ఉస్మాన్ అలీ నిర్మింపజేశారు. మూసీని మురికికూపం చేసింది కాంగ్రెస్ అనేది 2015లో సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇచ్చిన రిపోర్టు చెబుతోంది. అప్పటికి కాంగ్రెస్, టీడీపీ పాలించాయి కాబట్టి.. వారిదే ఈ పాపం. కేసీఆర్ ప్రభుత్వం వచ్చేవరకూ ఎవరూ మూసీని పట్టించుకోలేదు. మేము అధికారంలోకి వచ్చాక.. మూసీ బీఓడీ, సీఓడీ పరిశీలించాం. దాన్ని సుందరీకరించేందుకు ప్రయత్నించాం” అని కేటీఆర్ అన్నారు. “మూసీ పుట్టే అనంతగిరి అడవుల్లో దానికి ఉరేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి.. నావల్ రాడార్ కేంద్రానికి అనుమతి ఇచ్చారు. మేము మానవీయ కోణంలో మూసీని సుందరీకరించాలనుకున్నాం. మేము ప్రతిపాదించిన బడ్జెట్ రూ.16,634 కోట్లు. 57కిలోమీటర్ల నదికి బ్యూటిఫికేషన్ కోసం మేము అప్పుడు ప్రతిపాదించాం. 2017లో మేము ఆరు మంచి ఉద్దేశాలతో.. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తెచ్చాం. మూసీపై 15 బ్రిడ్జిలు నిర్మించాలనుకున్నాం. ఆల్రెడీ మేము కొంత ప్రారంభించాం. ఓసారి నాగోల్‌కి వెళ్లి చూసి రావచ్చు, మేము ఆల్రెడీ అక్కడ కొంత చేశాం. ఐదు కిలోమీటర్లు మేము మార్పులు చేశాం. కానీ ఒక్క పేదవారినీ వెళ్లగొట్టలేదు” అని కేటీఆర్ అన్నారు. “హైదరాబాద్‌లో 31 %యూ%ల్లో కొన్ని పూర్తి చేశాం, కొన్ని పూర్తవ్వాల్సి ఉంది. ఇవన్నీ పూర్తైతే, నల్గొండకు స్వచ్ఛమైన నీరు వెళ్తాయి. ఇక్కడ సీఎం కొత్తగా చెయ్యాల్సిందేమీ లేదు. అది ట్రీటెడ్ వాటర్. చాలా శుద్ధమైనది. గావుకేకలు పెడుతున్న నల్గొండ మంత్రులు.. మీ సీఎంలాగా కాకుండా విషయం తెలుసుకోండి, అజ్ఞానం వీడండి. రూ.11 వందల కోట్లతో గోదవరి నుంచి గండిపేటకు నీరు తెస్తే.. నల్గొండకు మేలు జరుగుతుంది. మేము స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం తెచ్చాం. 2020 తర్వాత మొత్తం 985 కోట్లతో.. నాలాలను తీర్దిదిద్దాం. అందుకే ఇప్పుడు హైదరాబాద్‌లో నీరు నిల్వ ఉండట్లేదు” అని కేటీఆర్ అన్నారు.

# ‘సూపర్ సిక్స్’పై కసరత్తు

## నవంబరు రెండో వారంలో ఏపీ బడ్జెట్!

మొదటి పేజి తరువాయి

2024 ఏప్రిల్ నుంచి జులై 31 వరకు నాలుగు నెలల కాలానికి మొత్తం 40 గ్రాంట్ల కింద రూ.1,09,052.34 కోట్లకు శాసనసభ ఆమోదం తీసుకున్నారు. జూన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. జులైలో పూర్తి స్థాయి బడ్జెట్ సమర్పించాల్సి ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడం, ఎన్ని అప్పులున్నాయో తెలియని గందరగోళ పరిస్థితుల్లో.. పూర్తి వివరాలు రాబట్టి ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం వెలువరించి పకడ్బందీ వ్యూహంతో ముందుకెళ్లాలనే ఉద్దేశంతో మరోసారి ఓటాన్ ఎకౌంట్‌కు ఆర్డినెన్సు రూపంలో ఆమోదం తీసుకున్నారు. ఆగస్టు నుంచి నవంబరు వరకు రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులు, ఇతర కార్యకలాపాల కోసం రూ.1,29,972.97 కోట్లతో 40 గ్రాంట్ల కింద రెండో తాత్కాలిక బడ్జెట్‌కు గవర్నర్ నుంచి ఆమోదం తీసుకున్నారు. ఇలా మొత్తం 8 నెలల కాలం ఓట్ ఆన్ అకౌంట్ పద్దుతోనే గడిచిపోయింది. ఈ నేపథ్యంలో నవంబరు రెండో వారంలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టి శాసనసభ ఆమోదం తీసుకోవాల్సి ఉంది.

### సంక్షేమానికి అదనపు కేటాయింపులు!

ఎన్నికల్లో ఎన్డీయే కూటమి సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు భారీగా సంక్షేమ పథకాల అమలుకు హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే వృద్ధాప్య, ఇతర పెన్షన్ల మొత్తాన్ని పెంచి అమలు చేస్తున్నారు. మిగిలిన సంక్షేమ పథకాల అమలుపై ఆర్థికశాఖ కసరత్తు చేస్తోంది. జగన్ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాల వ్యయం కన్నా మరో రూ.20 వేల కోట్ల వరకు అదనంగా ఖర్చవుతుందని అధికారులు లెక్క తేల్చినట్లు సమాచారం. నవంబరు నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ కూడా అమలు కాబోతోంది. రాబోయే నాలుగు నెలల్లో ఏ పథకం ఎలా అమలు చేయబోతున్నారో బడ్జెట్‌లో రూపురేఖలు వెల్లడిస్తారు. ఆయా పథకాల విధివిధానాలు, లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా అంచనా వ్యయాలు రూపొందించారు. ప్రస్తుతం నిరుద్యోగభృతికి ఎంత వ్యయమవుతుందో అంచనాలు రూపొందించినా భవిష్యత్తులో ఉపాధి కల్పన మేరకు ఈ భారం తగ్గుతుందనే అంచనాలో ఉన్నారు. సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆర్థికశాఖ అధికారులు సూచనప్రాయంగా వెల్లడిస్తున్నారు.

### రూ.2.90 లక్షల కోట్లతో పూర్తి స్థాయి పద్దు!

వాస్తవానికి చివరి నాలుగు నెలల కాలానికి బడ్జెట్ ఖర్చులకు ఆమోదం తీసుకోవాల్సి ఉన్నా.. ఏడాది మొత్తానికి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిందే. దాదాపు రూ.2.90 లక్షల కోట్ల మేరకు బడ్జెట్ ఉండొచ్చని ప్రాథమిక సమాచారం. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో పెద్దపీట వేయనున్నారు. రహదారుల నిర్మాణం, మరమ్మతులు కీలకం కానున్నాయి. కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా కూడా వివిధ పథకాలకు బడ్జెట్‌లో నిధులు చూపబోతున్నారు. కేంద్ర పథకాలకు, రాష్ట్ర వాటా నిధులు సమకూరుస్తూ దాదాపు 28 పథకాల కింద పనులు చేయబోతున్నారు. ప్రస్తుతం ఆర్థికశాఖ కార్యదర్శి ఆయా ప్రభుత్వ శాఖలతో ప్రతిపాదనలపై కూలంకషంగా చర్చిస్తున్నారు. తదుపరి దశలో మంత్రుల స్థాయి సమావేశాలు ఉంటాయని సమాచారం.

# ఇలాంటి పరిస్థితులను గతంలో ఎప్పుడూ చూడలేదు



గతంలో ఎప్పుడూ కూడా ఇలాంటి పరిస్థితులను చూడలేదని అన్నారు. రాష్ట్రంలో ఏ అరాచకం చూసినా, దాని వెనుక ఏదో ఒక గంజాయి బ్యాచ్ ఉంటోందని, తప్పు చేసిన వాళ్లను మాత్రం విడిచిపెట్టే ప్రసక్తేలేదని చంద్రబాబు హెచ్చరించారు. అధికారంలోకి రాగానే ఏడు అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేశామని వెల్లడించారు. రాష్ట్రంలో ఇసుక, మద్యంపై కొత్త పాలసీలు తీసుకువచ్చామని చెప్పారు. అయితే ఇసుక, లిక్కర్ అంశాల్లోనే కాకుండా... ఇతర వ్యాపారాల్లోనూ ఎవరూ జోక్యం చేసుకోవద్దని టీడీపీ ప్రజాప్రతినిధులకు చంద్రబాబు స్పష్టం చేశారు. మాగుంట కుటుంబం ఎప్పటినుంచో లిక్కర్ వ్యాపారంలో ఉందని, ఆ విధంగా కుటుంబ వారసత్వంగా వచ్చే వ్యాపారాలు చేసుకుంటే ఫర్వాలేదని, కొత్తగా లిక్కర్ వ్యాపారంలోకి వెళ్లి ధనార్జన చేయాలని ప్రయత్నించవద్దని హెచ్చరించారు. నేతలకు విశ్వసనీయత రావాలంటే ఎంతో సమయం పడుతుందని, ఆ విశ్వసనీయత పోవడానికి నిమిషం చాలని... ఇది తనకు కూడా వర్తిస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో ఎప్పటినుంచో ప్రముఖ పాత్ర పోషిస్తున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని అభివర్ణించారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న టీడీపీ శక్తిమంతమైన పార్టీగా ఆవిర్భవించిందని చంద్రబాబు పేర్కొన్నారు. టీడీపీ ఏనాడూ అధికారం కోసం అర్రులు చాచలేదని, దేశం కోసం, ప్రజల కోసం పాటుపడడమే టీడీపీకి పరమావధి అని వివరించారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు టీడీపీ సమర్థవంతమైన పాత్ర పోషించిందని చంద్రబాబు తెలిపారు. నాడు ఎలాంటి పదవులు తీసుకోకుండానే వాజ్‌పేయి ప్రభుత్వంలో కొనసాగామని గుర్తు చేశారు. పార్టీ కూడా ఓ కుటుంబం వంటిదేనని, చిన్న చిన్న సమస్యలు ఉండడం సహజమేనని అన్నారు. “పార్టీలో ఉన్న వారు ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉండాల్సిన అవసరం ఉంది. ఇప్పటి పరిస్థితుల్లో కార్యకర్త తప్పు చేసినా సీఎంపై ఆ ప్రభావం పడుతుంది. పార్టీ కూడా నష్టపోతుంది. మిమ్మల్ని ఎవరూ గమనించడంలేదు అనుకోవద్దు. ఇటీవల ఎన్నికల్లో అవతలి వారు బస్తాల కొద్దీ డబ్బులు వెదజల్లారు. కేవలం డబ్బుతోనే ఎన్నికలు జరుగుతాయనుకోవద్దు. మనపై నమ్మకంతోనే ప్రజలు ఓటేశారు. కేంద్రంలో అనుకూల ప్రభుత్వం వచ్చింది కాబట్టే క్రమంగా నిలదొక్కుకుంటున్నాం. కూటమిలో ఉన్నాం కాబట్టి మిగతా భాగస్వామ్య పార్టీలను కూడా సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలి” అంటూ చంద్రబాబు కర్తవ్య బోధ చేశారు.

# న్యాయం గెలిచిందంట... మరి వీటి సంగతేంటి?

మొదటి పేజి తరువాయి



దీనిపై జగన్ విమర్శనాస్త్రాలు సంధించారు. “నిజం నిలిచిందంట... న్యాయం గెలిచిందంట... స్కిల్ డెవలప్ మెంట్ కేసులో అక్రమ కేసు పెట్టిన జగన్ కి చెంపపెట్టులా, చంద్రబాబు గారికి ఎటువంటి సంబంధం లేదని ఈడీ క్లీన్ చిట్ ఇచ్చిందని ఆ ట్వీట్ లో రాసుకున్నారు. నిజంగా ఏమైనా బుద్ధి, జ్ఞానం ఉన్నాయా? మనుషులను ఏమనుకుంటున్నాడు? మనుషులకు చదువు రాదనుకుంటాడా? మనుషులు చదవలేరనుకుంటాడా? మనుషులకు అసలేమీ తెలియదనుకుంటాడా? ఎంత ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 మీడియా సామ్రాజ్యం ఆయనకు ఉంటే మాత్రం, ఎంతగా గోబెల్స్ ప్రచారం చేయగలనన్న అతి విశ్వాసం ఆయనకు ఉంటే మాత్రం... ఈ మాదిరిగా వక్రీకరించడం అన్నది ఎవరు చేయగలుగుతారు? స్కిల్ డెవలప్ మెంట్ కేసులో నిందితుల ఆస్తులను ఈడీ అటాచ్ చేస్తే, దీనికి సమాధానం ఏంటంటే చెప్పడు. సోషల్ మీడియాలో మాత్రం తనకు నచ్చినట్టుగా రాసుకుంటాడు... దీనికి ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 వత్తాసు పలుకుతాయి. చంద్రబాబు ఎందుకు ఈ విధంగా అబద్ధాలకు రెక్కలు కడుతున్నాడు? అసలు ఈడీ ప్రెస్ నోట్ లో ఎక్కడైనా క్లీన్ చిట్ అనే ప్రస్తావన ఉందా? సుమన్ బోస్, వికాస్ ఖాన్విల్కర్ లకు డబ్బులు ఎక్కడ్నించి వెళ్లాయి? వీళ్లకు ఈ డబ్బులు ఎవరిచ్చారు? నాడు చంద్రబాబు 13 చోట్ల సంతకాలు పెట్టి రూ.371 కోట్లు విడుదల చేయడం వాస్తవం కాదా? ఆ డబ్బులు మాకు ముట్టలేదు అని సీమెన్స్ కంపెనీయే చెప్పిన మాట వాస్తవం కాదా? తమకు ఎలాంటి డబ్బులు ముట్టలేదని జర్మనీకి చెందిన సీమెన్స్ ఒరిజినల్ కంపెనీ నోయిడాలోని మేజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇవ్వడం వాస్తవం కాదా? ఆ డబ్బు పుణే నుంచి హైదరాబాద్ వెళ్లినట్టు సీమెన్స్ సంస్థ అంతర్గత విచారణలో వెల్లడి కాలేదా? ఇలా బయటికి వెళ్లిన డబ్బులను దారిమళ్లించిన మాట వాస్తవం కాదా? అలా బయటికి వెళ్లిన సొమ్ము తిరిగి హవాలా మార్గంలో చంద్రబాబు జేబులోకి చేరడం వాస్తవం కాదా? రాబోయే రోజుల్లో చంద్రబాబును, ఆయన పీఎస్ శ్రీనివాస్ ను ఈడీ అరెస్ట్ చేయదా? దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకోవడం అంటే ఇది కాదా? తాము చంద్రబాబు ఆదేశాల మేరకు డబ్బు విడుదల చేశామని ఇద్దరు ఐఏఎస్ అధికారులు 164 సెక్షన్ కింద మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇచ్చారు... ఇది వాస్తవం కాదా? మరి, కళ్లెదుటే ఇవన్నీ కనిపిస్తుంటే చంద్రబాబు ఏమంటున్నాడు... నిజం నిలిచింది... న్యాయం గెలిచిందంట!” అంటూ జగన్ తూర్పారబట్టారు.

## సుప్రీంకోర్టు తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా!



సిఫారసు చేసిన సుప్రీం చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తన వారసుడి పేరును ప్రకటించారు. తదుపరి చీఫ్ జస్టిసగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ఆయన సిఫారసు చేశారు. వచ్చేనెల 10వ తేదీన జస్టిస్ చంద్రచూడ్ పదవీకాలం ముగియనుంది. దిగిపోయే ముందు సుప్రీంకోర్టులోని సీనియర్ న్యాయమూర్తి పేరును చీఫ్ జస్టిస్ పదవికి సిఫారసు చేయడం ఆనవాయితీ. ఈ సంప్రదాయాన్ని అనుసరించి బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ప్రతిపాదిస్తూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ చంద్రచూడ్ లేఖ రాశారు. అనంతరం.. కేంద్ర న్యాయశాఖ ప్రధానమంత్రి పరిశీలనకు పంపుతుంది. ప్రధాని ఆమోదం తర్వాత రాష్ట్రపతి సిఫారసుకు పంపుతారు. చివరిగా రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత భారత ప్రధాన న్యాయమూర్తి నియామక ప్రక్రియ పూర్తవుతుంది. కేంద్ర ప్రభుత్వం స్థాయిలో లాంఛనాలు సజావుగా పూర్తయితే జస్టిస్ సంజీవ్ ఖన్నా సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా నవంబరు 11వ తేదీన బాధ్యతలు తీసుకుంటారు. ఆరు నెలలకు అటుఇటుగా, అంటే వచ్చే ఏడాది మే 13వ తేదీ వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. జస్టిస్ చంద్రచూడ్ తర్వాత సీనియారిటీలో రెండోస్థానంలో ఉన్న ఆయన.. ప్రస్తుతం నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ (నల్సా) ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా, జస్టిస్ చంద్రచూడ్ 2022 నవంబరు తొమ్మిదిన సీజేఐగా జస్టిస్ ఎన్వీ రమణ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

ఎవరీ ఖన్నా?

ఎమర్జెన్సీ కాలంలో గుర్తుండే అనేక తీర్పులు రాసిన సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ హన్స్‌రాజ్ ఖన్నా మేనల్లుడే జస్టిస్ సంజీవ్ ఖన్నా. రాజ్యాంగానికి ఎన్ని సవరణలు ప్రతిపాదించినా, దాని మౌలిక స్వరూపాన్ని మాత్రం మార్చడానికి వీల్లేదంటూ 1973లో కేశవానంద భారతీ కేసులో చరిత్రాత్మక తీర్పును ఇచ్చిన న్యాయమూర్తుల ధర్మాసనంలో ఆయన ఒకరు. ఎమర్జెన్సీ అమలులో ఉండగా, అన్ని హక్కులతోపాటు జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ కూడా రద్దయిపోతాయంటూ.. ఏడీఎమ్ జబల్‌పూర్ కేసులో సుప్రీంకోర్టు 1976లో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు రాసిన ధర్మాసనంలోని మెజారిటీ జడ్జీలతో విభేదించి, వేరుగా తీర్పు రాసిన ఒకే ఒక న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా. దీంతో సీనియారిటీ రీత్యా చీఫ్‌జస్టిస్ కావాల్సిన ఆయనను, ఆ పదవి చేపట్టకుండా అప్పటి కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంది. దీనికి నిరసనగా ఆయన సర్వీసు ఉండగానే తన పదవికి రాజీనామా చేశారు. జస్టిస్ ఖన్నాకు అలా ఆనాడు చేజారిన ఆ పదవిని ఆయన బంధువు జస్టిస్ సంజీవ్ ఖన్నా త్వరలో చేపడుతుండటం విశేషం. ఆయన తండ్రి జస్టిస్ దేవ్‌రాజ్ ఖన్నా కూడా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందించడం మరో విశేషం. సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, తన మేనమామ జస్టిస్ హన్స్‌రాజ్ ఖన్నా పనిచేసిన అదే కోర్టు గది నుంచి తన మొదటి రోజును జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రారంభించారు. ఆయన 1960 మే 14వ తేదీన జన్మించారు. ఢిల్లీలోని బరాఖంబా రోడ్‌లోని మోడరన్ స్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తిచేశాడు. ఢిల్లీ యూనివర్సిటీలోని లా సెంటరు క్యాంపసలో 1980లో చదువు పూర్తి చేసుకున్నారు. తన పేరును 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కాంప్లెక్స్ జిల్లా కోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. అనంతరం ఢిల్లీ హైకోర్టు, ట్రైబ్యునల్స్‌లో రాజ్యాంగ, ప్రత్యక్ష పన్నులు, మధ్యవర్తిత్వం వంటి విభిన్న రంగాల్లో ప్రాక్టీస్ చేశారు. అలాగే.. కమర్షియల్ లా, కంపెనీ లా, ల్యాండ్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా వంటి రంగాల్లో ప్రాక్టీసతో పాటు ఆదాయపు పన్ను శాఖకు సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. 2004లో ఢిల్లీ ప్రభుత్వంలో నేషనల్ కేపిటల్ టెర్రిటరీకి స్టాండింగ్ కౌన్సెల్‌గా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టులో అనేక క్రిమినల్ కేసుల్లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, అమికస్ క్యూరీగా పనిచేశారు. 2005లో ఢిల్లీ హైకోర్టుకు అదనపు న్యాయమూర్తిగా నియమితులయి, ఏడాది తర్వాత శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు తీసుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా 2019 జనవరి 18న నియమితులయ్యారు.

ఈవీఎంలపై కీలక తీర్పు..

ఎన్నికల నిర్వహణకు వాడుతున్న ఈవీఎంలపై తలెత్తిన భయసందేహాలను తొలగిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా కీలక తీర్పును వెలువరించారు. ‘ఈవీఎం యంత్రాలు చెల్లుతాయి. అవి భద్రమే’నని తేల్చి చెప్పారు. పోలింగ్ కేంద్రాలను ఆక్రమించడం, బోగస్ ఓటింగ్‌కు పాల్పడటం వంటి చర్యలు ఈవీఎంల రాకతో ఆగాయని అప్పట్లో ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల బాండ్ల అంశంపై తీర్పును ఇచ్చిన ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్‌ఖన్నా ఒకరు. బాండ్ల జారీని రాజ్యాంగ విరుద్ధంగా అప్పట్లో బెంచ్ తేల్చేసింది. అలాగే, జమ్మూకశ్మీర్‌కు ఉద్దేశించిన అధికరణం 370ను రద్దు చేస్తూ 2019లో కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పు రాసిన ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా ఉన్నారు. అయితే.. ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా మాత్రం తన తీర్పును సొంతంగా చెప్పారు. సీజేఐ చంద్రచూడ్, జస్టిస్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ కలిసి ఒక తీర్పు వెలువరించగా.. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా మరో రెండు తీర్పులను వెలువరించారు. జమ్మూకశ్మీర్‌లో మానవహక్కుల ఉల్లంఘనల అంశాన్ని జస్టిస్ సంజీవ్ ఖన్నా తన తీర్పులో ప్రస్తావించారు. ఢిల్లీ మద్యం పాలసీ వ్యవహారంలో అరెస్టు అయిన అప్పటి సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్నికల్లో ప్రచారం నిర్వహించడానికి వీలుగా మధ్యంతర బెయిల్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా మంజూరు చేశారు.

## దామ్య తండలో ఉచిత కంటి వైద్య శిబిరంను ప్రారంభించిన

### లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ షెఫర్డ్ చైర్మన్ రొయ్యూరు సురేష్



మానుకోట జిల్లా ప్రతినిధి(గౌతమ్ న్యూస్): మానుకోట జిల్లా కురవి మండలం దామ్య తండా గ్రామపంచాయతీలో శ్రీ సత్య లయన్స్ చారిటబుల్ కంటి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష కేంద్రాన్ని నిర్వహించారు. దామ్య తండా గ్రామపంచాయతీలో ఆరు తండాలు కలవు, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ షెఫర్డ్ చైర్మన్ రొయ్యూరు సురేష్, సిపిఐ మండల నాయకులు బానోత్ లింగ నాయక్ ఆధ్వర్యంలో శ్రీ సత్య లయన్స్ చారిటబుల్ కంటి హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోయ్యురు సురేష్ మాట్లాడుతూ గిరిజన తండాలలో ఉచిత మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకొని, శ్రీ సత్య చారిటబుల్ కంటి హాస్పిటల్ వారు ఉచితంగా క్యాట్ రాక్ ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు కావున శ్రీ సత్య చారిటబుల్ కమిటీ హాస్పిటల్ వారికి సహకరించి, ఈ ఉచిత కంటి వైద్య శిబిరం ను విజయవంతం చేయండి. ఈ దామ్మె తండా గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ షెఫర్డ్ చైర్మన్ రొయ్యూరు సురేష్, శ్రీ సత్య లయన్ చారిటబుల్ కంటి హాస్పిటల్ మేనేజర్ ధారావత్ బాలు నాయక్, డి ఓ ఏ సహాయ కంటి వైద్యులు అంగోత్ అఖిల్, తండా నాయకులు బానోత్ లింగ్యా నాయక్, బానోత్ దాము నాయక్, నవీన్ నాయక్, బానోత్ గణేష్ నాయక్, హేమ నాయక్, పంచాయతీ కార్యదర్శి జగన్, ఏఎన్ఎం శ్రీమతి, తాట్యా తండా మాజీ సర్పంచ్ రమేష్ నాయక్, వాంకుడోత్ రమేష్, శ్రీ సత్య లయన్ చారిటబుల్ కంటి హాస్పిటల్ పిఆర్ఓ భూక్య మోహన్ నాయక్, ఆశ, గ్రామపంచాయతీ సిబ్బంది, తండా ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

## కబడ్డీ పోటీలు ప్రారంభించిన

### ఎంఈఓ మంకిడి వీరభద్రరావు .



గార్ల (గౌతమ్ న్యూస్): స్థానికమండల పరిధి మర్రిగూడెంలోశ్రీ వెంకటేశ్వర స్వామిమినీ స్టేడియంలో నాలుగు జిల్లాల స్థాయిలో జరిగే కబడ్డీ ఆటల పోటీలను మండల ఎంఈఓ మంకిడి వీరభద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడా పోటీలలో గెలుపోటములు సహజమని అన్నారు పి ఈ టిలున్యాయబద్ధంగా వ్యవహరించాలని అన్నారు ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘం వ్యవస్థాపకులు కస్నా నాయక్, లాయర్ హరినాయక్, భీముడు, చిలకబాబు, పుల్లూరు మాజీ ఉప సర్పంచ్, మాజీ ఎంపీపీ లాలు నాయక్, రాముగౌడ్, మల్లీ బాబు, హెచ్ఎం ఎం రామచంద్రు. భీముడు, రామ్కి పీఈటీలు తదితరులు పాల్గొన్నారు

## పరిపాలనా చేత కానీ దద్దమ్మ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి

### అధికారం లో కి రాక ముందు కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పి ప్రభుత్వం ఇప్పుడు మాట మార్చడం ఏమిటని ఆగ్రహా వ్యక్తం చేసిన తెలంగాణ ఉద్యమ నాయకుడు రామలింగం



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 10 నెలలు పాలనా అయింది ఇప్పటి వరకు ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యరంటీలో ఒక్క పథకం అన్న కరెక్ట్ గా ప్రజల కు అందించిందా? ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కోసం ఎన్నో దగుల్ బాజీ మాయ మాటలు చెప్పిన రేవంత్ ఎందుకు ఇప్పట్టీ వరకు రెండు లక్షల రూపాయలు మాఫీ చేయలేదని రైతు భరోసా ఎందుకు ఇవ్వకుండా ఉన్నాడాని? పెంచిన పింఛన్లు పెన్షన్ దారులకు ఇంతవరకు ఎందుకు ఇవ్వడం లేదు? తులం బంగారు ఎక్కడ? పోయింది ఇలా పేద ప్రజలు మోసం చేసి అధికారం లో కి వచ్చిన డమ్మీ హామీలు ఇచ్చి ఇప్పుడు రోజుకో డ్రామా తో కాలయాపన చేయడం మంచిది కాదని ఆయన అన్నారు ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తా అన్న పిట్ మెంట్ ఎక్కడ? అధికారంలోకి రాక ముందు కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామని చెప్పిన ముఖ్య మంత్రి నేడు పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ రైతులను తడి బట్టతో గొంతు కోసిన రేవంత్ ప్రభుత్వం కౌల్ రైతులు పట్టాదారు తో మాట్లాడుకోవాలి అని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు ప్రజలకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి నేడు ప్రజలకు గత ప్రభుత్వం పూర్తిగా అప్పు చేసింది అని చెప్పడం హాస్యాస్పదం వారు అన్నారు మీరు ప్రభుత్వ నడపడానికి తప్పు చేయడం లేదా అని ప్రశ్నించారు మీ పాలన వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని వారు అన్నారు గురుకుల పాఠశాలల్లో పురుగుల అన్నంతో నీళ్ల చారుతో పేద విద్యార్థుల కడుపులు కొడుతున్న ప్రభుత్వం పేద పిల్లల చదువులు ఈ రాష్ట్ర ప్రభుత్వంకి అవసరం లేదా అని అన్నారు.ప్రజలకు ఇచ్చిన ప్రతిదాన్ని నెరవేర్చకుంటే రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు

## సబ్ జైలును సందర్శించిన డి.ఐ.జీ మాధారపు సంపత్ కుమార్



మానుకోట జిల్లా ప్రతినిధి(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ సబ్ జైలును తెలంగాణ జైళ్ల శాఖ డీఐజీ మాధారపు సంపత్ కుమార్ శుక్రవారం నాడు సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చిన డీఐజీ సంపత్ కుమార్ కు వరంగల్ జిల్లా సబ్ జైళ్ల అధికారి విజయ్ దేనీ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జైలు అంతా కలియతిరిగారు. ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలు, జైల్లో అమలు చేస్తున్న పద్ధతుల విషయాలను సబ్ జైలు జైలర్ మల్లెల శ్రీనివాసరావు డిఐజికి వివరించారు. జైల్లో పరిశుభ్రత, పచ్చటి వాతావరణం, ఖైదీల సంక్షేమం పట్ల డీఐజీ సంతృపి వ్యక్తంచేశారు. ఖైదీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్ జైలు అధికారులు డీఐజీ సంపత్ కుమార్ కు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జైలు ఉన్నతాధికారులు పట్టేం భిక్షపతి, సిటిజన్ ఫోరమ్ సభ్యులు శంతన్ రామరాజు,సదా నిరంజన్, సబ్ జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డి. ఎం. హెచ్. ఓ కార్యాలయంలో

### పరిపాలన అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రాజేష్ కుమార్



హనుమకొండ(గౌతమ్ న్యూస్): హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో పరిపాలన అధికారిగా (అడ్మినిస్ట్రేటివ్ అధికారి) కోల రాజేష్ కుమార్ నేడు పదవి బాధ్యతలు స్వీకరించారు. డి ఎం హెచ్ ఓ డా.కే. లలితాదేవి కి రిపోర్ట్ చేసిన అనంతరం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయనకు శాలువాతో సత్కరించి, పూల బోకే అందజేసి, శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.

# కాలం చెల్లిన వాహనాలను సీజ్ చేయాలి!

### ఫిట్నెస్ లేని వాహనాలపై రవాణా శాఖ నిర్లక్ష్యం!

### కాలుష్యానికి కారణం పాత వాహనాలు!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో వివిధ జిల్లాలలో గ్రామాలలో పట్టణ ప్రాంతాలలో విచ్చలవిడిగా కాలం చెల్లిన ద్విచక్ర వాహనాలు, స్కూటర్లు, బైకులు, తో పాటు ట్రాక్టర్లు, కార్లు, జీపులు, ఆటోలు ట్రక్కులు లారీలు విద్యాసంస్థల బస్సులు తో పాటు ఇతర అనేక రకాల వాహనాలు పుణ్యకాలం దాటినప్పటికీ రోడ్ల పైన విచ్చలవిడిగా తిరుగుతూ కాలుష్యానికి కారణం అవుతున్నాయని ప్రజల ఆరోపిస్తున్నారు, 15 ఏళ్లకు ఒక్కసారి తిరిగి రవాణాశాఖ అధికారుల ద్వారా తమ తమ



వాహనాలను రీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన వాహనదారులు సమయం గడిచిపోయిన కూడా వాహనాలను అడ్డతీండిగా నిత్యం జన సంచారం కలిగిన జిల్లా కేంద్రాలలో నడుపుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, ప్రభుత్వ నిబంధన ప్రకారం 10 సంవత్సరాల మించిన డీజిల్ వాహనాలు 15 సంవత్సరాల పైబడ్డ పెట్రోల్ వాహనాలు తప్పకుండా రవాణా శాఖ అధికారుల తో తిరిగి రిజిస్ట్రేషన్ పొందాలి కానీ రిజిస్ట్రేషన్ చార్జీలు భారీ మొత్తంలో పెంచడం వల్ల తుప్పు పట్టిన వాహనాలను వాహదారులు నిబంధనలకు విరుద్ధంగా రవాణా శాఖ అధికారుల కండ్ల ముందే దర్జాగా వాహనాలు నడిపిన పట్టించుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి, గతంలో 300 ఉన్న రీ రిజిస్ట్రేషన్ చార్జిని ఏకంగా వెయ్యి రూపాయలకు పెంచారు, గతంలో ఆటోలకు జీపులకు కార్లకు ఇతర ఫోర్ వీలర్ వాహనాలకు 600 రూపాయలు ఉన్న రిజిస్ట్రేషన్ చార్జిని ఏకంగా 5000 పెంచారు, దీనివల్ల పాత వాహనదారులు తిరిగి రీ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ముందుకు రావడంలేదని తెలుస్తుంది,

అయినప్పటికీ నిత్యం జన సంచారం పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా జిల్లా కేంద్రాలలో కాలుష్యానికి దుమ్ముదులికి వివాహనాలు ప్రాణ సంకటంగా తయారయ్యాయి, కాలుష్య కారక వాహనాలపై కఠినంగా వ్యవహరించవలసిన రవాణాశాఖ అధికారుల



అసమర్థత వలనే ఈ తతంగం కొనసాగుతుందని చూసి చూడనట్లు మామూలు తీసుకొని వదిలిపెడుతున్నారని విమర్శలు వస్తున్నాయి, అంతేకాక ఫిట్నెస్ లేని కాలం చెల్లిన పాత వాహనాలను నిర్మూలించేందుకు ప్రభుత్వం కూడా ఇలాంటి చర్యలు చేపట్టకపోవడం బాధాకరం జిల్లా రవాణా ట్రాన్స్పోర్ట్ అధికారులు తనిఖీలు చేయకపోవడం వల్లనే విచ్చలవిడిగా కాలం చెల్లిన స్కూటర్లు ,బైకులు, ఆటోలు ఇతర వాహనాలు తిరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు, ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని వనపర్తి, నాగర్ కర్నూల్, గద్వాల, నారాయణపేట, జిల్లాలతో పాటు



నియోజకవర్గాలలో కూడా వివాహనాలు అధికంగా ఉన్నాయని ఇప్పటికైనా జిల్లా రవాణా శాఖ అధికారులు ఆయా జిల్లాలలోని ఫిట్నెస్ లేని కాలం చెల్లిన అన్ని రకాల వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు, ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ కు ప్రజలు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది,

# గుడుంబా స్థావరాల పై తనిఖీ చేసేది ఎవరు

### మండలంలో విచ్చలవిడిగా గుడుంబామకాలు.

గార్ల (గౌతమ్ న్యూస్): స్థానిక మండల కేంద్రం ,మండలంలో గుడుంబా వ్యాపారంకుటుంబ వ్యాపారంగా నడుస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు తెలంగాణ ప్రభుత్వంగుడుంబా రహిత రాష్ట్రం కోస0 రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా వాటిని




అరికట్టడం లో ఎక్కడో ఓ దగ్గర విఫలమవుతూనే ఉన్నాయి.నాటు సారా తాగి ఎన్నో కుటుంబాలు రోడ్డు పాలు కావడం,ఎంతో మంది యువత మధ్యలోనే తనువులు చాలిస్తున్న సంఘటనలు అనేకం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుడుంబా పై నిషేధం పై గట్టి చర్యలు చేపట్టింది.కానీ దాన్ని వ్యాపారంగా చేసుకుని బతుకుతున్నా కొందరు రహస్యంగా గుడుంబా తయారు చేస్తూ,మండల మైధాన,పట్టణ



కేంద్రాలకు తరలిస్తూ ఒకుటీర పరిశ్రమగా వారి దందా కొనసాగిస్తున్నట్లు సమాచారంమండలంలోనే విచ్చలవిడిగా సారా లభించడంతో అసలు ఇది ఎక్కడ తయారు చేస్తున్నారనే అనుమానం స్థానికులలో మొదలైంది. మండల పరిధిలో పదుల సంఖ్యలో గిరిజన తండాలు ఉండడంతో సారా తయారీ అక్కడే జరుగుతుందా అనే అనుమానాలు బలంగా ఉన్నాయి. గుడుంబా తయారీ దారులు పంట పోలాల మధ్య న డెన్ లు ఏర్పాటు చేసుకొని గుడుంబా కాచి , టు వీలర్ వాహనాలపై నిత్యం వివిధ ప్రాంతాలలోకి సరఫరా చేస్తున్నట్లు సమాచారం. అక్కడక్కడ అధికారులు గుడుంబా స్థావరాలపై దాడుల సందర్భంలో వారిపై మహిళలను ఉసిగొల్పి దాడులు చేసిన సంఘటనలు ఉన్నాయి.

### బెల్టు మద్యం కొనలేక ..యువత గుడుంబా వైపు...

వందల రూపాయలు ఖర్చు పెట్టి మద్యానికి బానిసైన వారు బెల్టుషాపుల లో కొనుగోలు చేయడం కోకొల్లలు చూశాం. అయితే ఇదే సమయంలో మద్యానికి అలవాటు పడ్డ కూలీలు ,మత్తుకు బానిసైన యువత ,ఇతరులు అంత ఖర్చు పెట్టి మద్యం తాగలేక ప్రత్యామ్నాయం వైపు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. దీన్ని ఆసరాగా చేసుకున్న పలువురు గుడుంబా వ్యాపారులు తిరిగి నాటుసారాను తయారు చేసినట్లు స్థానిక ప్రజలు మాట్లాడుకుంటున్నారు. అప్పటినుండి నాటు సారా కు అలవాటు పడ్డ కూలీల బలహీనతను ఇంకా కూడా గుడుంబా వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. వీటన్నిటినీ నియంత్రించడంలో ఎక్సైజ్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బెల్టు షాపు నిర్వాహకులతో బెంబేలెత్తిపోతున్న స్థానిక మహిళలు నాటుసారా కూడా దొరుకుతుండడంతో తమ కుటుంబంలోకి ప్రవేశించి ఎప్పుడు చిచ్చుపెడుతుందోని భయాందోళనకు గురవుతున్నారు.ఇకనైనా ఎక్సైజ్ శాఖ అధికారులు గట్టి నిఘా పెంచి అక్రమ గుడుంబా వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నారు

# అంతరాష్ట్ర గొలుసు దొంగను చాకచకంగా పట్టుకున్న పట్టణ, సిసిఎస్ పోలీసులు

మానుకోట జిల్లా ప్రతినిధి(గౌతమ్ న్యూస్): మానుకోట జిల్లాలో అంతర్రాష్ట్ర గొలుసు దొంగను చాకచక్యంగా పట్టుకున్న మహబూబాబాద్ టౌన్ మరియు సీసీఎస్ పోలీసులు దొంగతనాల కేసులలో 20.9 తులాల బంగారు వస్తువులు స్వాధీనం వీటి విలువ 14,63,000. మహబూబాబాద్ పట్టణంలో గత కొంత కాలంగా వరుస చైన్ స్నాచింగ్ లు జరుగుతున్నందున ప్రజలు భయభ్రాంతు లకు గురవుతున్నారని జిల్లా ఎస్పి సుధీర్ రామ్ నాథ్ కేకన్ ఆదేశాల మేరకు చెన్నయ్య అదనపు ఎస్పి క్రైమ్స్ పర్యవేక్షణలో మహబూబాబాద్ డిఎస్పి ఎన్.తిరుపతిరావు ఆధ్వర్యంలో మహబూబాబాద్ టౌన్ మరియు సీసీఎస్ పోలీసులు 4 బృందాలుగా ఏర్పడి ఈరోజు తేదీ 18.10.2024 న ఉదయం 6. 00గం,లకు వాహనాలు తనిఖీ చేయుచుండగా మహబూబాబాద్ ఇల్లందు రోడ్ ఆర్తి గార్డెన్ దగ్గరలో ఒక వ్యక్తి అనుమానస్పదంగా బయ్యారం వైపు నుండి మహబూబాబాద్ వైపు కు హీరో స్పెండర్ బైకు పై వస్తూ పోలీసు వారిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకోవడం జరిగింది, అతని యొక్క వివరాలు- ఆంగోతు విక్రమ్ తండ్రి ఏసు, వృత్తి: డ్రిల్లింగ్ మిషన్ వర్క్, %జ%రామాలయం ఎదురుగా, బయ్యారం, మహబూబాబాద్ జిల్లా, వివరాల్లోకి వెళితే ఆంగోతు విక్రమ్ తన తల్లిదండ్రులతో కలిసి 2013 వరకు ఖమ్మం లో ఉండేవాడు. ఆ తర్వాత విక్రం తల్లి దండ్రులు గార్ల బయ్యారం కు షిఫ్ట్ అయ్యారు, దాంతో విక్రం కిరాయి ఇంట్లో ఉంటూ డిగ్రీ చదువుతున్న సమయంలో సెల్ ఫోన్ లో ఆన్ లైన్ బెట్టింగ్ ఆడటం అలవాటు అయి డబ్బులు పోగొట్టుకొని అప్పులైనాడు, తిరిగి డబ్బులు ఎలా సంపాదించాలని సెల్ ఫోన్ ఫేస్ బుక్ లో చైన్ స్నాచింగ్ సిన్లు




చాలాసార్లు చూసి, తను కూడా అలాగే చైన్ స్నాచింగ్ లు చేసి డబ్బులు సంపాదించి, అప్పులు తీర్చి తిరిగి ఆన్ లైన్ బెట్టింగ్ లు




ఆడుతూ జల్సాలు చేస్తూ బ్రతుకుదాం అని ప్లాన్ చేసుకొని గత సంవత్సరం నుండి తన తండ్రి యొక్క హీరో స్పెండర్ ప్లస్ బైక్ పై ఖమ్మం మరియు మహబూబాబాద్ జిల్లాల ఏరియాలో తిరుగుతూ ఒంటరిగా వెళ్లే మహిళల మెడలలో ఉన్న బంగారు వస్తువులను లాక్కొని దొంగతనాలు చేసినాడు. గొలుసు దొంగతనాలకు వెళ్లేటప్పుడు ఎవరు గుర్తుపట్టకుండా తమ బైక్ యొక్క నెంబర్ ప్లేట్ ను తొలగించి ముఖానికి మాస్క్ ధరించి చైన్ స్నాచింగ్ లు చేసినాడు, ఇప్పటివరకు మహబూబాబాద్ పట్టణంలో కృష్ణ కాలనీ లో ఒకటి, బ్యాంకు కాలనీలో రెండు, కంకర బోర్డ్ ఏరియాలో ఒకటి చొప్పున మొత్తం 4, ఖమ్మం టౌన్ ఏరియాలో 7 గొలుసు దొంగతనాలు చేసినాడు, తాను దొంగిలించిన బంగారు వస్తువులను ఎవరికైనా అమ్ముకునేందుకు తమ స్పెండర్ బైక్ పై శుక్రవారం మహబూబాబాద్ కు వస్తుండగా మహబూబాబాద్ ఆర్తి గార్డెన్స్ వద్ద పోలీసు వారు పట్టుకోవడం జరిగింది, స్వాధీనపరచుకున్న వస్తువుల వివరాలు:- 22.4 తులాల బంగారు వస్తువులు, హీరో స్పెండర్ ప్లస్ బైక్, ఒప్పో స్మార్ట్ ఫోన్ -01 (వీటి మొత్తం విలువ రూ. 14,63,000/-), మణప్పురం గోల్డ్ లోన్ నందు తాకట్టు లో ఉన్న బంగారు వస్తువులు 33 గ్రా, మార్కెట్ విలువ 5.2,31,000/- (మొత్తం బంగారు వస్తువుల యొక్క మార్కెట్ విలువ రూ.16,94,000/-). ఇతనిపై సస్పెక్ట్ షీట్ మరియు పీడీ యాక్ట్ కూడా పెట్టి నిఘా పెంచడం జరుగుతుంది. కావున ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి ఏమనగా ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు మీ ఏరియాలలో అనుమానాస్పదంగా తిరిగినట్లయితే వెంటనే డయల్100 కి కాల్ చేయవలెను, ఈ కేసులో విశ్వసనీయ సమాచారం సేకరించి నేరస్తులను పట్టుకున్న మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ పి.దేవేందర్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ హతీరం నాయక్, సీసీఎస్ సబ్ ఇన్స్పెక్టర్ ఎస్కే.తహర్ బాబా, సబ్ ఇన్స్పెక్టర్ బి.విజయ్ కుమార్ సిబ్బంది, కానిస్టేబుళ్లు ఎస్.నరేష్, కే.బాలు మరియు హోంగార్డు మధుసూధన్ రెడ్డి లను శ్రీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ అభినందించినారు.

గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
శనివారం - 19 - అక్టోబర్ - 2024

## తపస్ మెదక్ జిల్లా మహిళా విభాగం ఎన్నిక ఏకగ్రీవం







దుబ్బాక ఆర్.సి(గౌతమ్ న్యూస్): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మెదక్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా జంగిటి స్వరూప రాణి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాళ్ల కల్ మనోహరాబాద్ మండలం, ప్రధాన కార్యదర్శిగా రేఖ సుజాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బండ పోసాన్ పల్లి, వెల్దుర్తి మండలం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మెదక్ జిల్లా తపస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్ తెలిపారు . ఈ సందర్భంగా ఎన్నికైన తపస్ మహిళా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ తమను ఎంపిక చేసినందుకు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి కి ధన్యవాదాలు తెలుపుతూ, మెదక్ జిల్లాలో తపస్ అభివృద్ధికి కృషి చేస్తామని వారు అన్నారు.

## ఆంధ్రజ్యోతి రిపోర్టర్ కుటుంబ సభ్యులను
# పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు





హనుమకొండ (గౌతమ్ న్యూస్): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 55వ డివిజన్ పరిధిలోని భీమారం గ్రామానికి చెందిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ హెచ్143 హన్మకొండ జిల్లా కార్యదర్శి నాయకాపు సుభాష్ గౌడ్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. కాగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కే. ఆర్ నాగరాజు శుక్రవారం వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ మాజీ డిప్యూటీ మేయర్ అనారోగ్యంతో మృతి



**హనుమకొండ(గౌతమ్ న్యూస్): వరంగల్ మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ శుక్రవారం అనారోగ్యంతో మరణించారు. ఆయన మృతి పట్ల పలువురు చింతిస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున వరంగల్ డిప్యూటీ మేయర్ గా పనిచేశారు.**

## జిల్లా ఎస్పీ పరదేశి నాయుడు విగ్రహం ఏర్పాటు చేయాలి!
### ఉమ్మడి జిల్లాలో ప్రజల కోసం ప్రాణం బలి!!




నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో 1993 సంవత్సరంలో జిల్లా ఎస్పీగా పని చేసిన ఆనాటి జిల్లా ఎస్పీ స్వర్గీయ పరదేశి నాయుడు విగ్రహాన్ని ఉమ్మడి జిల్లాలోని వనపర్తి ,నాగర్ కర్నూల్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఏర్పాటు చేయాలని ఆయా జిల్లాల ప్రజలు రాజకీయ నాయకులు విద్యావంతుడు మేధావులు, జర్నలిస్టులు డిమాండ్ చేస్తున్నారు, ప్రజల కోసం తన ప్రాణాన్ని చిన్న వయసులోనే డైనమిక్ ఐపీఎస్ ఆఫీసర్ గా మావోయిస్టులకు పుట్టిన పురిటిగడ్డ మహబూబ్నగర్ జిల్లాలో ఆయన చిన్నతనంలోనే పనిచేసే తన ప్రాణాలను ఈ జిల్లా ప్రజలకు అంకితం చేశారు, ఈ దుర్ఘటన ఏ రోజు కూడా మరపురాని మాయని మచ్చగా మిగిలిపోక తప్పదని ఇప్పటికి ప్రజలు అంటున్నారు, కొల్లాపూర్ మావోయిస్టులకు పెట్టిన పేరుగల నియోజకవర్గంలో సోమశిల గ్రామంలో మావోయిస్టులు గెలిచిన అటవీ శాఖ గెస్ట్ హౌస్ ను పరిశీలించడానికి తన పోలీస్ సిబ్బందితో బయలుదేరిన ఎస్పీ తో పాటు ఎస్ఐలు పోలీస్ కానిస్టేబులు అక్కడికక్కడే ప్రైవేట్ సాంబయ్య బస్సు లో ఎగిరిపడి చెల్లాచెదురుగా ముక్కలు చక్కగా ప్రాణాలు కోల్పోయారు, ఈ సంఘటన నవంబర్ 13 సాయంత్రం ఐదు గంటల సమయంలో జరిగింది, ఈనెల 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ రాష్ట్రంలో ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎంతోమంది ఐపీఎస్ అధికారి వ్యాసు, చదలగంటి ఉమేష్ వంటి గొప్ప ఐపీఎస్ పోలీస్ అధికారులను కాల్చి చంపిన ఘటన పైన ప్రభుత్వం హైదరాబాద్ నగరంతో పాటు ప్రతి జిల్లా కేంద్రంలో విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఎప్పటికీ గుర్తుండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారు

## శంషాబాద్ మండల్ ఘన్సమియ గూడ గ్రామంలో
# బారుగేట్లు విరాళం ఇచ్చిన డాక్టర్ రామ్ రాజ్



శంషాబాద్ (గౌతమ్ న్యూస్): శంషాబాద్ మండల్ ఘన్సిమియా గూడా గ్రామం లో ఇటీవల గ్రామంలో నిర్మించిన నూతన రోడ్డు వలన ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా పెరగడం జరుగుతుంది శంకరపురం చర్ల గూడా,,Imt కాలేజీ ORR కు వెళ్లే భారీ వాహనాలు కార్లుల వలన గ్రామంలో ఉన్నటువంటి ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలకమర్రి మహేందర్ మరియు జిల్లా ఆనంద్ ఎన్ఎస్యూఐ గార్లు లిమ్స్ హాస్పటల్ యాజమాన్యం డాక్టర్ రామ్ రాజ్ గారిని కలిసి బారుగేట్లు ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా లిమ్స్ హాస్పటల్ నుండి ఘన్సిమియా గూడా గ్రామానికి నాలుగు బార్ గేట్లు ఇవ్వడం జరిగింది, బ్యాడ్ గేట్లు ఏర్పాటు చేసినందుకు డాక్టర్ రామ్ రాజ్ గారిని శాలువాతో సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ తోక మల్లేష్ గౌడ్, లీడర్ జంగయ్య, రవీందర్ గౌడ్, జిల్లా నందం, బాబు,రాజు,గుగిళ్ల శ్రీనివాస్, శ్రీకాంత్, హసీన్, ఇమ్రాన్, ప్రభు, రజాక్, పాముల సిద్దయ్య,తదితరులు పాల్గొన్నారు



## దేశంలో కార్మిక వర్గంపై ప్రభుత్వాల యాజమానుల
# అణచివేత దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుదాం



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): టేకులపల్లి మండలంలోని కేటిసి బాడీ బండ్ల జంక్షన్ వద్ద. టియుసిఐ లో ఐఎఫ్ టియు విలిన. మహాసభ కరపత్రం పంచుతూ. ఐఎఫ్టియు టేకులపల్లి ఏరియా కమిటీ కార్యదర్శి. జరుపుల సుందర్. మరియు తెలంగాణ మోటర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి. పాయం వెంకన్న. మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గంపై ప్రభుత్వాల యాజమానుల అణచివేత దోపిడీ పెరుగుతున్నది కార్మిక వ్యతిరేక విధానాలు తీవ్రంగా ముందుకు వస్తున్నాయి ఆర్థిక దోపిడీయె కాకుండా. మత ఉన్మాద. దృక్పథంతో పాసి స్ట విధానాలతో మోడీ ప్రభుత్వం ముందుకు వస్తున్నది కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నది కార్మిక వర్గ ఐక్యతకు సమిష్టి ఉద్యమానికి దేశవ్యాపిత సంఘ నిర్మాణానికి ఐఎఫ్టియు పరితపించింది, తమిళనాడు. కర్ణాటక. మహారాష్ట్ర. గుజరాత్, బెంగాల్, బీహార్, ఢిల్లీ, పంజాబ్.తదితర 14 రాష్ట్రాల్లో పనిచేస్తుంద నివారన్నారు, ఈనెల 20న సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో విలీన ప్రక్రియ కొనసాగుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాగర్,ఉపేందర్,రమేష్,మోహన్,ప్రవీణ్నజీర్, తదితరులు పాల్గొన్నారు.

## కడిపికొండ లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే

### సన్న వడ్లకు ఎంఎస్పీ తో పాటు 500 బోనస్

### రైతుల పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు



హనుమకొండ(గౌతమ్ న్యూస్): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని 44వ డివిజన్ కడిపికొండ సూర్యకుటీర్ నందు కాజీపేట దర్గా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం



(ప్యాక్స్) వారి ఆధ్వర్యంలో వానకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తున్నట్లు దీనికోసం 25 వేల కోట్ల నిధులను సమకూర్చినట్లు తెలిపారు. ఎలాంటి నిబంధనలు లేకుండా రైతులు ఎన్ని క్వింటాలు పండించిన 500 బోనస్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రెండు రకాల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దొడ్డు రకం సన్న రకం వడ్లను వేరువేరుగా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం అమ్మిన రైతులకు రెండు, మూడు రోజుల్లో డబ్బులు జమ చేసేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే తెల్ల రేషన్ కార్డులకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేస్తుందని అన్నారు. అలాగే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం గురుకులాలకు సన్నబియ్యం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే సన్న వడ్లకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే 18 వేల కోట్ల రుణాలు మాఫీ చేశామని మరో మూడు నాలుగు నెలల్లో మరో 12 వేల కోట్ల రుణాలు మాఫీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఆర్థిక వనరులను దృష్టిలో పెట్టుకొని రాజకీయ పార్టీలు మాట్లాడాలని సూచించారు. 43 లక్షల మంది రైతులకు 31 వేల కోట్ల రుణాలను మాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందని ఎవరు అధైర్యపడవద్దన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గం లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళల ద్వారా నిర్వహించాలనే ఐకెపిలు మరియు పాక్స్ వార్ల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ఇలాంటి సమస్యలు వచ్చినా వెంటనే నా దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పాక్స్ ద్వారా సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కోసం 5 లక్షల చెక్ ను అందజేయడం



అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, పాక్స్ చైర్మన్, డైరెక్టర్స్ మరియు వ్యవసాయ అధికారులు, ఎమ్మార్వో, కార్పొరేటర్స్ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ షేపార్డ్, బేరా సొసైటీ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిట్లను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ బానోత్ కాశీరాం నాయక్



మానుకోట /గూడూరు మండలం ప్రతినిది(గౌతమ్ న్యూస్): మానుకోట జిల్లా గూడూరు మండలం ఏపూర్ గ్రామంలో ఇటీవల విష జ్వరాల బారిన పడి అనారోగ్యానికి గురైన గ్రామ ప్రజలకు ప్రతి కుటుంబానికి డా,, రోయ్యురి సురేష్, లయన్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ షేపార్డ్ %ఆ% బేరా సొసైటీ వారి సహకారంతో ఎస్టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్న నాయక్ ఆధ్వర్యంలో ఇంటింటికి న్యూట్రీషియన్ జ్యూస్ కిట్టు, బియ్యం, పప్పు, బిస్కెట్ ప్యాకెట్లు, తదితర సామాగ్రిని అందించుటకు ముఖ్య అతిధిగా హాజరై గ్రామ ప్రజలకు న్యూట్రీషియన్ కిట్లను ప్రజలకు అందజేసిన సిఐ బానోత్ కాశీరామ్ నాయక్. ఈ సందర్భంగా సిఐ బానోత్ కాశీరామ్ నాయక్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్,- బేరా సొసైటీ వారు ఏపూరు గ్రామ ప్రజలకు సహాయం చేయడానికి ముందుకు రావడం చాలా ఆనందకరమని లయన్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ షేపార్డ్, - బేరా సొసైటీ వారు వరద బాధిత కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉంటూ ఎంతో మంది పేద ప్రజలకు ఎనర్జీ ఫుడ్ ను అందిస్తూ అనేక



సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ హైదరాబాద్ షెఫర్డ్ చైర్మన్ డాక్టర్ లయన్ రోయ్యూరు సురేష్, %ఆ% బేరా సొసైటీ ప్రతినిధులు ఏపూరి గ్రామ ప్రజలకు విషజ్వరం బారిన పడ్డ వారికి ఎనర్జీ ఫుడ్డును అందిస్తూ గొప్ప కార్యక్రమం చేయడం శు భ సూచికమని ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆకాంక్షిస్తూ వారిని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపూరు గ్రామ పెద్దలు బానోత్ చందా, వాంకుడోత్ చందూలాల్, వాంకుడోత్ గోపీనాథ్, భానోత్ ఈశ్వర్, కొండాపురం సుధాకర్, అజ్మీరా ఈశ్వర్, వంకుడు భద్య, భయ్యా మల్లేశం, భానోత్ తరుణ్, సిద్దు, రాకేష్, లోకేష్, భగత్ సింగ్, అధ్యరామ్, తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మునగ సాగు తో ఎకరానికి లక్ష రూపాయల ఆదాయం

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం కలెక్టరేట్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నర్సరీలు, మొరింగా ప్లాంటేషన్, అజోల్ల పెంపకం, కెనాల్ బండ్ ప్లాంటేషన్,చేపల పెంపకం,పుట్టగొడుగుల పెంపకం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన లతో కలిసి జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీ వోలు, ఏపీవోలు, ఏపిఎంలు మరియు ఈసీఎస్ లతో ఐ డి ఓ సి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ మన జిల్లాలో లోని రైతులు వరి, పత్తి మరియు మొక్కజొన్న పంటలు పండించడానికి ఆరుగాలం శ్రమించి సాగు చేస్తే ఎకరానికి 20000 నుండి 30000 వరకు మాత్రమే లభిస్తుందన్నారు. రైతుకుఅధిక లాభం పొందేలా మనం ఉపాధి హామీ పథకం ద్వారా చేయవచ్చని తెలిపారు. మునగ సాగు ఎందుకు చేయాలో రైతులకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. ఎండాకాలంలో పొలాలు ఖాళీగా ఉంటాయని ఇప్పుడు వచ్చిన పంట డబ్బులు నుంచి కేవలం 10000 రూపాయలు పెట్టుబడి ద్వారా అంటే 2000 రూపాయలు విత్తనాలు, 2000 రూపాయలు ప్లాస్టిక్ బ్యాగులకు ఇంకా మట్టి ఎరువులకు తదితర ఖర్చులకు ఈ పెట్టుబడే డబ్బులు కూడా రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా మొక్క పెట్టుబడి కింద ఇవ్వడం జరుగుతుందని అన్నారు.ఎండాకాలంలో రైతులు పొలంలో ఖాళీగా ఉంచకుండా మునగ సాగు చేయాలని, దాని ద్వారా అధిక ఆదాయం పొందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ మునగ సాగు లో మునగ ఆకు పొడికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, ప్రస్తుతం మార్కెట్లో మునగాకు పొడి ధర కేజీ వెయ్యి రూపాయలు గా ఉందని చెప్పారు.అదేవిధంగాఒకవేళ కాయలు పెద్దవిగా అయ్యి ఎండిపోయినప్పటికీ, ఆ గింజ ద్వారా వచ్చే నూనెకు మార్కెట్లో అధిక డిమాండ్ ఉందని ప్రస్తుతం మార్కెట్లో లీటర్ మునగ నూనె ధర 3000 గా ఉందని, ఏ విధంగా చూసినప్పటికీ మునగ సాగు లాభదాయకమని అన్నారు. కేవలం 10000 రూపాయల పెట్టుబడితో 90 వేల నికర ఆదాయం, మళ్లీపెట్టుబడి 10000 ఉపాధి హామీ పథకం కిందతిరిగి వస్తుందని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దీనిలో భాగంగా మొదటి విడతలో జిల్లాలో పదివేల ఎకరాలు మునగ సాగు జనవరిలో చేపట్టే విధంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ నెలాఖరు కల్లా మొదటి విడత సాగులో కు రైతులకు సంబంధించిన వివరాలు, రైతు పేరు, చిరునామా, రైతుకు ఎన్ని ఎకరాలు ఉంది, మునగ సాగుకు అంగీకరించారు, నీటి లభ్యత, బోరు ఉందా లేదా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. తదుపరి రైతుకు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు వివరాలు ఒకవేళ రైతుకు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు లేనట్లయితే కార్డ్ ఇప్పించాలి అని తెలిపారు. జిల్లాలో మొక్కజొన్న పత్తి వరి ఆయిల్ ఫామ్ సాగు లో కేవలం మూడు శాతం మునగ సాగు చేసే లా చర్యలు చేపట్టాలని అదికాలను ఆదేశించారు. గుండాల ఇల్లందులో మొక్కజొన్న,పత్తి మొత్తం 32 వేల ఎకరాల్లో సాగు జరుగుతుంది అని దీనిలో 1400 ఎకరాల్లో మునగ సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలి జిల్లా కలెక్టర్ కోరారు.

## పిడిఎస్ యు 50 వసంతాల మేఘ గర్జన మరియు పోరాట స్ఫూర్తి సభల పోస్టర్స్ ఆవిష్కరణ!!




టేకులపల్లి (గౌతమ్ న్యూస్): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు ) 50 వసంతాలు (సంవత్సరాలు) పూర్తి చేసుకున్న సందర్భంలో పి డి ఎస్ యు జాతీయ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో అక్టోబర్ 21న మేఘ గర్జన సభను, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో ఆర్ట్స్ కళాశాల నందు అక్టోబర్ 25న పోరాట స్ఫూర్తి సభను నిర్వహిస్తున్నట్లు ఈ సభలను విజయవంతంకై ఈరోజు టేకులపల్లి మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల నందు పోస్టర్స్ ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు జిల్లా నాయకుడు బి భరత్ మాట్లాడుతూ. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం మొదలుకొని నేటి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రెండు రాష్ట్రాల్లో గత 50 సంవత్సరాలుగా విప్లవ విద్యార్థి సంఘం పిడిఎస్ యు శాస్త్రీయ విద్య సాధనకై, సమాజ లక్ష్యంతో సామ్రాజ్యవాద వ్యతిరేకిగా నిలుస్తూ విద్యా కార్పొరేటీ కరుణ, ప్రైవేటీకరణ, కాషాయీకరణను వ్యతిరేకిస్తూ పోరాటాలు ఉద్యమాలను నిర్వహిస్తుందని. విప్లవ విద్యార్థి సంఘం అయినా పిడిఎస్ యు ఏర్పడిన నాటి నుండి పేద విద్యార్థుల పక్షాన నిలుస్తూ విద్యారంగ తాత్కాలిక సమస్యలపై పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలను సాధించిందని సామ్రాజ్యవాద విష సంస్కృతిలో కొట్టుకుపోతున్న విద్యార్థిలోకాన్ని శాస్త్రీయ దృక్పథం అలవర్చుకునేలా పాటుపడుతుందని, అన్నారు ఈ కార్యక్రమంలో, డి.అరుణ్, రవితేజ, చరణ్, గౌతమి, శ్రీజ. ప్రియాంక, కావేరి, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం మెడికల్ కళాశాలలో దొడ్డిదారిలో ఉద్యోగాలు సంపాదించిన వారికి జీతాలు చెల్లించడం చాలా అన్యాయం

### వెంటనే వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం డిమాండ్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మెడికల్ కళాశాలలో రెండో విడతలో 73లో 49 మంది పోస్టులు అక్రమంగా అన్యాయంగా ఎటువంటి పేపర్ నోటిఫికేషన్ లేకుండా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా మెరిట్ లేకుండా జిల్లా సెలక్షన్ కమిటీ అప్రూవల్ లేకుండా జిల్లా సెలక్షన్ కమిటీ చైర్మన్ కలెక్టర్ అప్రూవల్ సంతకం లేకుండా దొడ్డి దారిన ఒక్కొక్క నిరుద్యోగి దగ్గర నుంచి మూడు నుంచి ఐదు లక్షల రూపాయలు అక్రమంగా యారో ఏజెన్సీ యాజమాన్యం అప్పనంగా వసూలు చేసి గత తొమ్మిది నెలలుగా విచారణ పేరుతో కాలయాపన చేసి ఎటువంటి చర్యలు తీసుకోకుండా మాసంఘం నేషనల్ ఎస్సీ కమిషన్ లో ఫిర్యాదు చేయగానే వీరి అవినీతి అంతా ఎక్కడ బయటపడిపోతుందో అని వెంటనే వారి అవినీతిని అంతా సక్రమంగా చేసుకోవడానికి కలెక్టర్ను సైతం తప్పుదోవపట్టించి అవినీతిని ప్రోత్సహిస్తూ తప్పుడు మార్గంలో ప్రస్తుత మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ యారో యాజమాన్యంతోకుమ్మక్కయ్యారు చాలాఅవినీతికి పాల్పడుతున్నట్లు తెలిపిన తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్.

## 20 న నర్సంపేటలో జరుగు అరుణోదయ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ను జయప్రదం చేయండి

**అరుణోదయ సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జక్కం కొండలరావు, మెంతెన కొండల రావు.**



టేకులపల్లి(గౌతమ్ న్యూస్): అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ఈనెల 20న నర్సంపేటలో నిర్వహిస్తున్నట్లు ఈ జనరల్ కౌన్సిల్ లో కవులు,కళాకారులు, రచయితలు,కళాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయ ప్రదం చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య భద్రాద్రి కొత్త గూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శు లు జక్కం కొండలరావు,మెంతిన కొండలరావు విజ్ఞప్తి చేశారు.టేకుల పల్లి మండల కేంద్రంలో జనరల్ కౌన్సిల్ కు సంబంధించిన సన్నాహ క సమావేశాన్ని వారు నిర్వహించా రు.ఈ సందర్భంగా వారుమాట్లాడు తూనర్సంపేటలోడప్పు, కోలాటం, డోలి,గొంగడి తదితర కళాకారులతో భారీ ప్రదర్శన జరగనుందని వారు వివరించారు.సమావేశంలో ఉపాధ్యక్షులు బి. నర్సింగ్,సహాయ కార్యదర్శి వీరమల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు

## కష్టమర్లకు నాణ్యమైన పెట్రోల్ ను అందించాలి

### రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): పాల్వంచ : పాల్వంచలో శుభ ఫిల్లింగ్ స్టేషన్ ను ప్రారంభించిన కొత్వాల. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టమర్లకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ ను అందించాలని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరరావు అన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని కుంటినాగులగూడెం లో ఏర్పాటు చేసిన శుభ ఫిల్లింగ్ స్టేషన్ ను శుక్రవారం కొత్వాల ప్రారంభించారు. శుభ ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులు ముప్పాళ్ళ పద్మ, జాస్తి ధనలక్ష్మిల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభ పూజలో కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి సామాన్యుడికి కూడా వాహనం నిత్యావసరమైన పరిస్థితులలో క్వాలిటీ, క్వాంటిటీ ముడి సరుకును అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు రంగా కిరణ్, పాల్వంచ మాజీ జడ్పిటిసి సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, నూకల రంగారావు, కందుకూరి రాము, దారా చిరంజీవి, పైడిపల్లి మహేష్, పులి సత్యనారాయణ, పిట్టల రాము, మాలోత్ కోటి నాయక్, శాంతి వర్ధన్, అజిత్, సామా వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ప్రధాన కార్యాలయములో సహపంక్తి భోజనాలు

### ముఖ్యఅతిథిగా సింగరేణి కార్పొరేట్ జిఎం (పర్సనల్, ఐ ఆర్ అండ్ పిఎం) కవితా నాయుడు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : దసరా పండుగ, దేవి శరన్నవరాత్రుల సంధర్భముగా కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయము నందు కొలువై ఉన్న దుర్గామాత గుడి నందు తేదీ : 18.10.2024 శుక్రవారం నాడు సహపంక్తి బోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు హాజరై అమ్మవారిని దర్శించుకొని, ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగులకు దగ్గర ఉండి భోజనాలను వడ్డించారు. ఈ సహపంక్తి బోజనాలలో కార్పొరేట్ పరిధి లోని అధికారులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు, అన్ని శాఖల జనరల్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు, ఆలయ కమిటీ మెంబర్స్ బి.కోటి, మోహన్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

## మండలంలో కొమరం భీమ్ 84వ వర్ధంతి వేడుకలు



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): శుక్రవారం కొమరం భీమ్ 84 వర్ధంతి సందర్భంగా టేకులపల్లి మండల ఆదివాసీ సేన మండల అధ్యక్షులు జోగా ప్రసాద్ సన్న సాయి మండల కమిటీ ఆధ్వర్యంలో కొమరం భీమ్ వర్ధంతి ఘనంగా నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జల్ జంగిల్ జమీన్ అనే నినాదంతో ఆదివాసులకు స్వేచ్ఛ స్వతంత్రం కోసం పోరాడిన యోధుడు కొమరం భీమ్ అన్నారు, కొమరం భీమ్ ఆధ్వర్యంలో 1940 లో ఆదివాసులు విముక్తి కొరకు జోడేఘాట్ సాయిధ పోరాటం ప్రారంభించారు, ఆదివాసుల స్వయం పాలన కోసం ఆయన చేసిన జూడేఘాట్ తిరుగుబాటు మహా జ్వాల చరిత్రగా నిలిచింది గోండు జీవులకు, ఆయన ఆరాధ్య దైవం కొలుస్తారని ఆయన వేసిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని వారన్నారు అనంతరం కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సనప రామారావు వూకే సురేష్, ఊకే రమేష్, ఊకె గోపాల్, వూకే పాపారావు, వూకే పాపయ్య, కోరం సర్వేష్, తుమ్మల చేలక కొత్తగుపు గ్రామ దొర ఊకె రామకృష్ణ మాజీ ఎంపిటిసి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# జీవో నెం 29 ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలి రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి

### సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ అధ్యక్షతన జిల్లా గ్రంథాలయం ఎదురుగా జీవో నెంబర్ 29 రద్దు పరచాలని రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు జీవో నెంబర్ 29 వల్ల గ్రూప్ వన్ అభ్యర్థులకు విద్యార్థులకు ఎస్సీ ఎస్టీ బీసీ కులాల వారికి అన్యాయం జరుగుతా ఉందని అన్నారు ఈ రాష్ట్రంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారానే ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులకు న్యాయం జరుగుతుందని అన్నారు గ్రూప్ వన్ పరీక్షలు ఈనెల 21వ తేదీ నుంచి నిర్వహించడం కోసం ఈ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 29 తీసుకువచ్చి ఈ రాష్ట్రంలో అగ్రవర్ణాలకు పట్టం కట్టాలని ఈ రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని అన్నారు ఈ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ గ్రూప్ వన్ అభ్యర్థులు హైకోర్టులో దాదాపుగా 20 కేసుల వరకు వేసి ఉన్నారు కానీ వాటిని ఈ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా హడావిడిగా ఈ గ్రూపు వన్ పరీక్షలను ఎలాగైనా నిర్వహించాలని పట్టుదలతో ముందుకు వెళ్లడం చాలా సిగ్గుచేటు ఒకవైపు అభ్యర్థులు హైకోర్టులో వేసిన కేసులు క్లియర్ అయిన తర్వాతనే గ్రూప్ వన్ పరీక్షలు నిర్వహించాలని ధర్నాలు రాస్తారోకోలు చేస్తా ఉంటే మరోవైపు ఈ రాష్ట్ర ప్రభుత్వం తన పంతాన్ని నెగ్గించుకోవడం కోసం అభ్యర్థులను బలి చేస్తా ఉన్నదని అన్నారు అగ్రవర్ణాలకు ఈ రాష్ట్రంలో ఆరు శాతం ఉన్నవారికి10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ ఎస్సీ ఎస్టీ బీసీలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు తరతరాలుగా దోపిడీకి గురైన కులాలకు సామాజికంగా వివక్షతకు గురి అయిన కులాలకు విద్యాపరంగా సామాజికంగా వెనుకబడిన కులాలకు రాజ్యాంగ నిర్మాత లు సామాజిక కోణంలో సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా ఏర్పాటు చేసింది రిజర్వేషన్ ఇవాళ ఎస్సీ ఎస్టీ బీసీలకు దక్కకుండా చేస్తున్నారుఈ ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ ఉపయోగించుకొని నేటి వరకు ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయో వారందరినీ ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్లను వెరిఫై చేయాలి ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఈ డబ్ల్యూ ఎస్ టిక్కెట్లు జారీ చేశారా లేదా అని నిగ్గు తేల్చాలి అక్రమంగా సర్టిఫికెట్ పొందిన వారికి ఉద్యోగం నుంచి తొలగించి క్రిమినల్ చర్యలు చేపట్టాలి ఆ సర్టిఫికెట్ జారీ చేసిన వారిపై కూడా క్రిమినల్ చర్యలు తీసుకోవాలని నేటి వరకు వారు పొందిన జీతభత్యాలను రికవరీ చేయాలి ఆయా స్థానాలలో ఉద్యోగాలు కోల్పోయిన ఎస్సీ ఎస్టీ బీసీ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలి ఎస్సీ ఎస్టీ బీసీ బిడ్డలకు జరుగుతున్న నష్టాన్ని నివారించాలంటే ఒకటి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ రద్దు చేయాలి ఈ రాష్ట్ర ప్రభుత్వం ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ అమలు నిలిపివేసి పాత విధానాన్ని కొనసాగిస్తూ నియామకాలు చేపట్టాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి శ్రీను నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్ ,జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, జూలూరుపాడు మండల అధ్యక్షులు బానోతు లక్ష్మణ్ నాయక్, పవన్ రమేష్ నాయక్, పవన్ నాయక్,దేవేందర్ నాయక్, సురేష్ నాయక్, బాలు నాయక్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఈ అనుభూతి అమోఘమైనది..



నల్లబెల్లి (గౌతమ్ న్యూస్): మండలంలో 15 మంది యువ ఉపాధ్యాయులు వీధుల్లో చేరగా వారిలో అత్యధికులు మహిళలే కావడం విశేషం కొత్తగా టీచర్ గా చేరిక చేతిలో చాక్ పిస్ ఎదురుగా పిల్లలు ఈ అనుభూతి అనిర్వాచార్యనీయమైనది అని తాజాగా వీధుల్లో చేరిన ఉపాధ్యాయులు తెలిపారు జీవిత లక్ష్యాన్ని చేరుకున్న వేళ తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల్లో పాఠం బోధించిన సమయంలో మనసు ఆనంద డోలికల్లో తెలియాడిందని డీఎస్సీ 2024 లో ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించిన వారు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య కుసుమాలను వెలిగించేందుకు వచ్చిన కొత్త ఉపాధ్యాయుల మనోగతం ఇలా ఉంది. ఉపాధ్యాయురాలుగా ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది మా నాన్న స్వామి బీఈడీ పూర్తి చేసి ప్రైవేట్ హై స్కూల్ ఏర్పాటు చేశాడు ఉపాధ్యాయ కొలువు సాధించాలని నాన్న కల నెరవేరేలా ప్రయత్నించాను 2016లో జిల్లాకు జీరో పోస్టులు ఉండడంతో నాన్ లోకల్ కోటాలో ఉద్యోగం సాధించలేకపోయాం అని పోకల మౌనిక అన్నారు ఉపాధ్యాయ వృత్తి అంటే ఎంతో అభిమానం పట్టుదల క్రమశిక్షణతో ప్రయత్నించాను తొలి ప్రయత్నం లోనే ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించడం గర్వంగా ఉంది ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు ఇటువైపు మళ్లేల కృషి చేస్తా విద్యార్థుల్లో మంచి మార్పు కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటా అని ధారావత్ పవన్ అన్నారు మొదటి సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్న గురువులు విలువలతో కూడిన విద్యను అందించడంతోనే మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించగలిగాను పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేలా బోధిస్తా ప్రభుత్వ పాఠశాలలలో పనిచేస్తూ పేద విద్యార్థులకు బోధించడం అదృష్టంగా భావిస్తున్నాను అని పులి రావుల అనిత అన్నారు. డీఎస్సీ 20 24 లో మండలంలో 15 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం మండల ప్రజలు వర్షం వ్యక్తం చేశారు.

## ఎక్కడో కాదండోయ్..! హన్మకొండ మున్సిపల్ ఆఫీస్ ముందే..!



హనుమకొండ (గౌతమ్ న్యూస్): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ హనుమకొండ జిల్లా కేంద్రం నక్కలగుట్ట లోని హనుమకొండ మున్సిపల్ కార్యాలయం ముందే ఈ పరిస్థితి దర్శనమిస్తుందీ..! హన్మకొండ, హైదరాబాద్ ప్రధాన రహదారి పైన సగం వరకు నీరు నిల్వ ఉండి ఆకుపచ్చ రంగులోకి మారి దుర్గంధం వెదజల్లుతున్న పట్టించుకునే వారే కరువయ్యారని, నగరం నడిబొడ్డులోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి ఏంటి అని వాహనదారులు, పాదచారులు, నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు..



**మెట్ పల్లి (గౌతమ్ న్యూస్): కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ జన్మదిన సందర్భంగా మైనార్టీ నాయకులు అబ్దుల్ జావిద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయడం జరిగింది ఇందులో శివ కిరణ్ షారుక్ సాబీర్ తదితరులు పాల్గొన్నారు**




## ట్రూ అప్ చార్జీల పేరుతో పేదలపై భారాలు తగదు

### స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్...

### సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ ఉప కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం.




పోలవరం (గౌతమ్ న్యూస్): బుట్టాయగూడెం..అక్టోబర్ 18.. ట్రూ అప్ చార్జీల పేరుతో పేదలపై భారాలు తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్ స్టేషన్ వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి. సిపిఎం పార్టీ, జిల్లా కార్యదర్శి, ఏ.రవి మాట్లాడుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించాలని అన్నారు. ప్రభుత్వం సర్దుబాటు చార్జీలు విధానం రద్దు చేయాలని, ట్రూ ఆఫ్ సర్దుబాటు అదనపు చార్జీలు వసూళ్లు నిలిపివేయాలన్నారు. రాష్ట్రంలో స్టార్ మీటర్ల వినియోగం వ్యతిరేకించాలని అన్నారు. ప్రభుత్వం ఉచిత కరెంట్ ఇస్తామని చెబుతూనే పేదలపై భారాలు మోపడం కూటమి ప్రభుత్వంకు తగదని అన్నారు. ప్రభుత్వం పేదలపై విద్యుత్ భారాలు మోపితే 2000 సంవత్సరం నాటి విద్యుత్ ఉద్యమం పునరావృతం అవుతుందని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం.మండల కార్యదర్శి టి. రామకృష్ణ,నాయకులు మొడియం నాగమణి, తామ ముత్యాలమ్మ,ఏ,ఫ్రాన్సిస్,పోలోజు నాగేశ్వరావు, ఉడతా వెంకటేష్, చంద్రు బుల్లెమ్మ, వెట్టి వీరయ్య,కే భాస్కర్,టి,వెంకటలక్ష్మి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## టేకులపల్లి పోలీస్ స్టేషన్లో ఆకస్మాత్తుగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పి



టేకులపల్లి(గౌతమ్ న్యూస్): శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ టేకులపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మితంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ లోనీ రికార్డులను పరిశీలించారు అనంతరం ఈ సందర్భంగా టేకులపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన రిక్వెస్ట్ బస్ స్టాప్ ను వాహనాల కోసం ఏర్పాటు చేసిన షెడ్డును, టేకులపల్లి బోడు రోడ్డు కూడలి, ముత్యాలంపాడు కూడలిలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలను ఆయన ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ను సుందరంగా తీర్చిదిద్దిన టేకులపల్లి సిఐ తాటిపాముల సురేష్ ఎస్ ఐ పోగుల సురేష్ ను ఆయన అభినందించారు ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి చంద్రభాను టేకులపల్లి సిఐ తాటిపాముల సురేష్ ఎస్సై పోగుల సురేష్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



## పత్తి రైతు గోస పట్టించుకోని ప్రభుత్వం



నల్లబెల్లి,వరంగల్(గౌతమ్ న్యూస్): నల్లబెల్లి మండలంలోని మూడు చెక్కల పల్లి గ్రామంలోరైతుల తో కలిసి క్షేత్ర స్థాయి లో పత్తి పంటలను పరిశీలించిన బిఆర్ఎస్ నాయకులు అకాల వర్షాలతో పత్తి దిగుబడి తగ్గిపోయిందని పత్తి పంట నష్టపోయిన రైతులకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గత 45 రోజులుగా నిత్యం కురుస్తున్న వర్షాలతో నల్లబెల్లి మండల లోని పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని వారు పేర్కొన్నారు వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం ఎకరాకు 8-10 క్వింటాళ్ళ పత్తి దిగుబడి రావాల్సి ఉంది.కానీ ఈ సారి ఎకరాకు 2-3 క్వింటాళ్ళ వరకే దిగుబడి వస్తుండటంతో రైతులు తీవ్ర దుఃఖంలో ఉన్నార ని మండలం లోని విస్తీర్ణంలో 1/3 వంతు పత్తి పంట సాగైంది.పత్తి రైతుల పరిస్థితిపై శాస్త్రీయ కోణంలో రిపోర్టులు తెప్పించుకుని ఇప్పటికే సమీక్ష నిర్వహించాల్సింది.బారీ వర్షాలతో ఇటీవల పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. పత్తి పంట నష్టం మాత్రం ఎక్కడా లెక్కకు రావటం లేదు నల్లబెల్లి మండలం లో వేల ఎకరాల్లో పత్తి పంట సాగైనట్టు వ్యవసాయ శాఖ రిపోర్ట్ చేసింది. మండలంలోని లోని 29 గ్రామ పంచాయతీలలో ఏ గ్రామంలో ,ఏ పార్టీ రైతు దగ్గరకు వెల్లి సర్వే చేసిన వ్యవసాయ శాఖ అంచనా వేసిన దిగుబడిలో 70% తక్కువగా దిగుబడి వచ్చిందని పంట దిగుబడి వచ్చిన చోట ఎకరాకు 475 రూపాయల బోనస్ చెల్లించాలి పంట లేదు కాబట్టి గతంలో నష్టపరిహారం ఇచ్చిన విధంగా నల్లబెల్లిలో వేల ఎకరాల పత్తి పంట నాశనం అయినందున కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు ఇప్పటికీ సీసీఐ కేంద్రాలు ప్రారంభించకపోవడం వల్ల వచ్చిన కాస్త దిగుబడి కూడా ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందని సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద అమ్ముకుంటే రైతులకు 7500 మద్దతు ధర పొందే అవకాశం ఉందని సిసిఐ కేంద్రాల ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ మార్కెట్లో 6-7 వేల ధరకే అమ్ముకొని రైతులు నష్టపోతున్నారని రైతు ఇంత తీవ్రంగా నష్టపోతుంటే దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని సర్వే నిర్వహించి నష్టపరిహారం అందేలా చూడాలని ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ చెట్టు పల్లి మురళీధర్, మాజీ అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, మండల పార్టీ నాయకులు బొమ్మిడి శివారెడ్డి ,గ్రామ పార్టీ అధ్యక్షుడు మూడు మంజీలాల్ ,భూక్య బాల రాజు మాజీ ఎంపిటిసి సభావత్ దేవ్ సింగ్ ,మాజీ సర్పంచులు బానోత్ ఫుల్ సింగ్ ,ఊరటి అమరేందర్, గువ్వ రాజు, మాజీ ఉపసర్పంచ్ గాదం రాజు, ఉపాధ్యక్షుడు సురేష్ తో పాటు గ్రామ రైతులు పత్తి పంట నష్టపోయిన రైతులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): విద్యుత్ వినియోగదారులకు మరియు రైతులకు ఈరోజు ఉదయం 9:00 నుండి 12 గంటల వరకు కోయగూడెం సబ్ స్టేషన్, మరియు బొమ్మనపల్లి సబ్ స్టేషన్ లో మరమ్మత్తులు మరియు 33 కె వి లైన్ నందు చెట్లు కొట్టుట కార్యక్రమం కలదు .విద్యుత్ వినియోగదారులు మరియు రైతులు సహకరించగలరు. బొమ్మనపల్లి ఏఈ బుజ్జి కన్నయ్య తెలియజేశారు.

## అందనాలపాడులో పిడుగు పడి మహిళ మృతి



**మహబుబాబాద్ జిల్లా, (గౌతమ్ న్యూస్): సిరోలు మండలం అందనాలపాడు గ్రామంలో పిడుగు పడింది. గ్రామ ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోతురాజు వెంకమ్మ (43) తమ వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తుండగా.. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు పిడుగు పడి మహిళ మృతి చెందింది. ఆమె మృతితో తమ బంధువులు కన్నీరు మున్నీరు అయ్యారు. దీనితో గ్రామంలో విషాద ఛాయలు అలుకుమున్నాయి.**

## జిల్లా బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో కొత్తగూడెం లో జిల్లా స్థాయి సమావేశం



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): రోజున ఉదయం 11 గంటలకు జిల్లా స్థాయి పార్టీ సమావేశం తెలంగాణ భవన్ కొత్తగూడెంలో పెట్టాలని జిల్లా పార్టీ అధ్యక్షులు మరియు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ నిర్ణయించడం జరిగినది బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బొమ్మర్ల వరప్రసాద్ గౌడ్ అన్నారు రెండు మూడు నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో క్యాడరును సిద్ధం చేయడానికి అందరం కలిసి కష్టపడి పార్టీకి పునర్వైభవం తీసురావడానికి సిద్ధపడాలని అందులో భాగంగా సమావేశం ఏర్పాటు చేయనైనది ఈ సమావేశానికి అన్ని మండల అధ్యక్షులు మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు మార్కెట్ కమిటీ అధ్యక్షులు సహకార సంఘాల అధ్యక్షులు రైతు సమన్వయ కమిటీ చైర్మన్లు వార్డు సభ్యులు మహిళా అధ్యక్షులు యువజన అధ్యక్షులు బీ.సీ ఎస్.సి మరియు ఎస్ టి సంఘాల అధ్యక్షులు మైనార్టీ కమిటీల అధ్యక్షులు సీనియర్ నాయకులు గ్రామ అధ్యక్షులు సోషల్ మీడియా నాయకులు ఇంకా వివిధ స్థాయిలో పనిచేసిన మాజీ ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలని, ఈ సమావేశానికి మన ఎంపీ గాయత్రి, రవి, ఎమ్మెల్సీ ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షులు తాత మధు, మాజీ మంత్రి వర్యులు, పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మెచ్చ. నాగేశ్వరావు, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే మరియు మాజీ మంత్రి వర్యులు వనమా. వెంకటేశ్వర్లు, మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మెన్ దిండిగాల. రాజేందర్, పాల్గొంటారని ఈ కార్యక్రమాన్ని బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు విజయవంతం చేయాలని టేకులపల్లి మండల అధ్యక్షులు తెలియజేశారు.

## క్రీడలతో ఉల్లాసం, ఉత్సాహంతో పాటు.. ఉద్యోగ అవకాశాలు... డిఎస్పి.ఉమామహేశ్వర్...





మెట్ పల్లి ఎం. డి.. సమి...(గౌతమ్ న్యూస్): యువతకు క్రీడలతో ఉల్లాసం ఉత్సాహంతో పాటు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని డిఎస్పీ ఉమామహేశ్వర్ పట్టణంలోని మినీ స్టేడియంలో పోలీస్ అమరవీరుల దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల సందర్భంగా మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత డ్రగ్స్ గంజాయి లాంటి మత్తు పదార్థాలు అలవాటు పడకుండా వారిలో చైతన్య నింపడానికి ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు అనంతరం యువతకు క్రీడలతో ఎన్నో మంచి అవకాశాలు ఉన్నాయని వాటిని వినియోగించుకొని యువత ఆదర్శంగా నిలవాలని కోరారు. అలాగే యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అనవసరపు కాల్స్ వస్తే మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో మెట్ పల్లి టౌన్ ఎస్ఐ చిరంజీవి ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ మల్లాపూర్ ఎస్ఐ. కిరణ్కుమార్..ఎస్ఐ2రాజు..ఎస్ఐ,సతీష్..ఆల్రౌండర్గంగాధర్..విగంగాధర్.. లష్మినారాయణ..ఎంప భారీ..సంజీవ్.. తదితరులు పాల్గొన్నారు..

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎనర్జీ డ్రింక్స్, బిస్కెట్ ప్యాకెట్ల పంపిణీ

### కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య ప్రవీణ్ నాయక్.





బయ్యారం(గౌతమ్ న్యూస్): బయ్యారం మండలం కొత్తపేట, గంధం పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ పాఠశాల పిల్లలకు ఎనర్జీ డ్రింక్స్, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ ఎన్ జి ఎస్ స్వచ్ఛంద సంస్థ వారు అందించిన ఎనర్జీ డ్రింక్స్ ను తీసుకోవడం ద్వారా పిల్లలకు శక్తి పెరుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్ జి ఎస్ స్వచ్ఛంద సంస్థ వారికి విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ జాగర్లమూడి భాస్కర్ రావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కారుబోతుల రామ్మూర్తి, ఐఎన్టీయూసీ మండల అధ్యక్షులు బొమ్మగంటి రాంబాబు, చల్ల సురేష్, బోడ సాయి అన్నపూర్ణ, సతీష్, మహేష్, మరకంటి శ్రీను తదితరులున్నారు.

## ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవుడు....

### మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు భాగ్యరాజ్...





మెదక్(గౌతమ్ న్యూస్): మెదక్ జిల్లా చేగుంట మండలం చందాయిపేట గ్రామ తాజా మాజీ సర్పంచ్ బుడ్డగడ్డ స్వర్ణలత భాగ్యరాజ్,



మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు భాగ్యరాజ్ నిరుపేద కుటుంబాలకు ఏ ఆపద వచ్చిన నేనున్నానంటూ ముందుకు వచ్చి ఆదుకునేది మనస్తత్వం భాగ్యరాజ్ దీ.. ఇంకా చెప్పాలంటే ఆడపిల్ల పెండిళ్లకు మేనమామ లాగా పుస్తె మట్టెలు అందించి ఆదుకునే ఆపద్బాంధవుడు, ఎవరైనా గ్రామంలో చనిపోతే వారి కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు 25 కేజీల బియ్యం, లేదా 50 కేజీల బియ్యం అందించి ఆపదలో ఆదుకునే నాయకుడు భాగ్యరాజ్ అని చెప్పుకోవచ్చు. భాగ్యరాజ్ చేసిన సేవలను గుర్తించి గ్రామ ప్రజలంతా మాట్లాడుతూ ఇటువంటి నాయకుడు దొరకడం మాకు ఎంతో సంతోషం అని ఆ గ్రామ ప్రజలు చెబుతూ ఉంటారు. సర్పంచ్ నుండి ఇంక ఉన్నత పదవులు ఎదగాలని చందాయిపేట గ్రామ ప్రజలు ప్రార్థిస్తున్నారు



## కాటిని రామకోటయ్య పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే డి ఎస్ రెడ్యానాయక్



డోర్నకల్, (గౌతమ్ న్యూస్): డోర్నకల్ మండలంలోని బూర్గుపహాడ్ గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు కాటిని రామకోటయ్య అనారోగ్యంతో మరణించారు. భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే శ్రీ డి ఎస్ రెడ్యా నాయక్, మాజీ ఎంపీపీ బాలు నాయక్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, రాయల వెంకటేశ్వర్లు, రాయల నరేష్, బజ్జూరి వెంకట్ రెడ్డి,కోటేష్, కాడెం బాబు, కాడెం ప్రశాంత్, నందిగామ రామ్ రెడ్డి, అనగానే ఉపేందర్, లింగన్నబోయిన రమేష్, నందిగామ జనార్దన్ రెడ్డి, పాల్గొన్నారు.

# ఆన్ లైన్ గేమ్....అప్పుల పాలు....

### రమ్మీ ఫ్రిఫైర్, పబ్జి మత్తులో జోగుతున్న కుర్ర కారు....

### బెట్టింగ్ ల తో నష్టపోతున్న వైనం..

### షేక్ జిపిఎస్ యాప్ ల తో లొకేషన్ మార్పు..

### నష్టపోతున్న బయటకు పొక్కకుండా జాగ్రత్తలు..

### ఆన్ లైన్ గేములపై 2020లో నిషేధం విధించిన ప్రభుత్వం..






మెదక్,(గౌతమ్ న్యూస్): పేకాట రాయుళ్లు ఆఫ్ లైన్ లో రమ్మీ ఆడటానికి ఇబ్బందులు పడుతూ.. హాయిగా వారి మొబైల్ నుంచి ఆన్ లైన్ జూదం ఆడుతూ బానిసలుగా మారిపోతున్నారు. ఈ క్రమంలో బ్యాంకు అకౌంట్ నుంచి డబ్బులు ట్రాన్స్ఫర్ చేసి మరి గేమ్ ఆడుతున్నారు. ఈ బెట్టింగ్ లో ఒకేసారి ఆరుగురు ఆడటానికి అవకాశం ఉంది. అయితే జిల్లాలో అధిక శాతం ఆన్ లైన్ రమ్మీ ఆడుతున్నారు అదేవిధంగా డ్రీమ్ లెవెల్ న్ వంటి నిషేధిత ఆన్ లైన్ గేమ్ బెట్టింగ్ యాప్ లను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. చాలామంది యువత సాయంత్రం అయితే ఆలస్యం పబ్జి, ఫ్రీ ఫైర్ గేములలో డబ్బులు వెచ్చిస్తూ ఆర్థికంగా చితికి పోతున్నారు. కొన్ని సందర్భాల్లో ఇవి యువత మధ్యన తగాదాలకు కూడా దారితీస్తున్నాయి

### చాప కింద నీరులా....

యువత పనిమీద శ్రద్ధ పెట్టకుండా 24 గంటలు ఇలాంటి గేముల మోజులో పడిపోతున్నారు. పెద్ద మొత్తంలో డబ్బులు నష్టపోతున్నారు. గేమ్ ఆడే వారి సంఖ్య జిల్లాలో క్రమంగా పెరుగుతూ వస్తోంది. గేమ్ గురించి ఏమీ తెలియని వారు సైతం యూట్యూబ్ లో వీడియోలు చూసి నేర్చుకుంటున్నారు. యదేచ్ఛగా బెట్టింగులు నిర్వహిస్తూ జీవితాలు చిన్న భిన్నం చేసుకుంటున్నారు.

### నిషేధం ఉన్నప్పటికీ...

పేకాట పై నిషేధం ఉన్నప్పటికీ ఆన్ లైన్ లో ఆడి రమ్మీ బెట్టింగ్ యాప్ లను యువత మెచ్చుకుంటున్నారు. ఈ గేమ్ ఉచ్చులో చిక్కుకొని అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ పరిస్థితి గమనించిన రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ఆన్ లై న్ బెట్టి గేమ్లపై నిషేధం విధించింది. వివిధ రకాల ఆన్ లైన్ గేమ్ సంస్థలు నిలిపివేసింది. ఎవరైనా ఆ సైట్ లోకి వెళితే ఆ గేమ్ అందుబాటులో లేదని చూపిస్తుంది. వారి ఐ పి అడ్రస్ తో పాటు లొకేషన్ వివరాలు తో సహా ఆ యువకుడు ఎక్కడివాడో ఇట్టే చెప్పగలిగే అవకాశం వెబ్ సైట్ నిర్వాహకుల వద్ద ఉండేది.

### నకిలీ జిపిఎస్ యాప్ తో..

ఎన్నో ఏళ్లుగా ఆన్ లైన్ బెట్టింగ్ గేమ్ లకు బానిసలు గా మారిన ప్రబుద్ధులు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసుకున్నారు. వారికి అనుకూలంగా ప్లే స్టోర్లో నకిలీ జిపిఎస్ యాప్లు వచ్చేసాయి. ఈ నకిలీ యాపులను తమ మొబైల్ ఫోన్ లో నిక్షిప్తం చేసుకుని తాము ఉన్న ప్రాంతం జిపిఎస్ లో కేషన్ వేరొక ప్రాంతం కింద చూపించే విధంగా సెట్టింగ్ మార్చుకుంటున్నారు. ఆన్ లైన్ జూదం గేమ్స్ నిషేధం విధించని రాష్ట్రాల లోకేషన్ ఈ యాప్ లలో అమర్చుకుని గేమ్ ఆడుతున్నారు. దీంతో లొకేషన్ వేరే ప్రాంతంలో చూపించడంతో గేమ్ ఆడేందుకు వెబ్సైట్ అంగీకరిస్తుంది. ఈ నేపథ్యంలో ఆన్లైన్ జూదం గేమ్స్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.





# కల్తీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

### రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. ఐకమ్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జన సత్యనారాయణ డిమాండ్.




బయ్యారం (గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని ఏజెన్సీ లో మొక్కజొన్న తో పాటు వరి, పత్తి ప్రధానమైన పంటలు. ఏజెన్సీలో ఉన్న గిరిజనులు, గిరిజనేతర రైతాంగం మొక్కజొన్న పంటను విస్తృతంగా సేద్యం చేస్తారని, దీన్ని ఆసరా చేసుకున్న వ్యాపార వర్గాలు గిరిజన రైతులకు కల్తీ విత్తనాలు అంటగట్టి అధిక దిగుబడులు వచ్చి లాభాలు వస్తాయని అంటగట్టారు. మొక్కజొన్న మొదట్లోనే ఏపుగా పెరగలేదు. తీరా చేతికందే దశలో



కంకే సరిగా రాక గింజలు కూడా కంకికి పట్టలేదు. వేలాది రూపాయలు పెట్టి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు అధిక దిగుబడులు వస్తాయని ఆశించారు. కానీ వారికి నిరాశ మిగిలింది. ఈ ప్రైవేటు వ్యాపారుల వద్ద వేలాది రూపాయలు వడ్డీకి తెచ్చి ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేస్తే మొక్కజొన్న కంకులు రాక , దిగుబడి రాని స్థితి ఉంది. అతివృష్టి వలన పంట నష్టపోయి రైతులు తీవ్రమైన నష్టానికి గురయ్యారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులు కనీసం పరిశీలన కూడా చేయని స్థితి నెలకొని ఉంది. నకిలీ విత్తనాలు, పురుగు మందులు మార్కెట్లో అమ్ముతున్న రెవెన్యూ శాఖ గాని, వ్యవసాయ శాఖ అధికారులు కానీ ఏమాత్రం చర్యలు తీసుకోకుండా, పంట నష్టం పై ఎటువంటి కనీస చర్యలు తీసుకోకుండా వ్యవహరిస్తున్నారు. తక్షణమే నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగానికి పంట నష్ట పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ అంశాలపై పరిశీలన చేసి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక మండల రెవెన్యూ అధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తాసిల్దార్ కి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఐకమ్స్ మండల అధ్యక్ష కార్యదర్శులు రామగిరి బిక్షం, భానోత్ నరసింహ, నాయకులు మేకపోతుల నాగేశ్వరరావు మురళీకృష్ణ, గంగారం బిక్షం, శివారపు శ్రీధర్ నేతకాని రాకేష్, బోనగిరి మధు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాల కలెక్టర్లకి వినతి పత్రం అందజేసిన డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్

నర్సంపేట (గౌతమ్ న్యూస్): డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లాల ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టులు సమస్యలపై వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాన్ని అందించడం జరిగింది. అందులో భాగంగా జిల్లా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పోశాల బిక్షపతి గౌడ్, కార్యదర్శి అంజత్, డి జె ఎఫ్, రాష్ట్ర కార్యదర్శి సోరపాక రాజు, డి జె ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్ల శ్రీనివాస్, కోశాధికారి ముదిగొండ శ్రీనివాసులు





పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శి సోరపాక రాజు మాట్లాడుతూ... వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్లతో సంబంధం లేకుండా యూనియన్లు, మీడియాలకు, అతీతంగా ఇండ్ల జాగలు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, ప్రతి జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు విద్యా సంస్థల్లో 50 శాతం రాయితీ కల్పించాలని, అందరితో పాటు సమానంగా ఇవ్వాలనే డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ లకు వినతి పత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సభ్యులు ర్యాలీగా బయలుదేరి వినతి పత్రాలను సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గం నుంచి నియోజకవర్గ ప్రజా అక్షరం న్యూస్ ఇంచార్జ్ భూక్యా వెంకన్న, నర్సంపేట టౌన్ రిపోర్టర్ రాకేష్, నిజం న్యూస్ రిపోర్టర్ రవి , గౌతమ్ న్యూస్ నర్సంపేట డివిజన్ రిపోర్టర్ వెంకట్ ఫోటోగ్రాఫ్ ఫోర్ జర్నలిస్ట్ చంద్రశేఖర్ తొలి అక్షరం న్యూస్ రిపోర్టర్ మాదారపు శ్రీనివాస్, అక్షర దివిటి న్యూస్ రిపోర్టర్ కూస సుదర్శన్ ఎన్ టెన్ న్యూస్ రిపోర్టర్ స్వామి గౌడ్, నిజం న్యూస్ రిపోర్టర్ రవి, ప్రెస్ న్యూస్ సీఈవో సుమన్, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కుటుంబాని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే డి ఎస్ రెడ్యానాయక్



డోర్నకల్, (గౌతమ్ న్యూస్): డోర్నకల్ మండలం దుబ్బతండ గ్రామన్నికి చెందిన జర్నలిస్టు అజ్మీర సక్రం బైక్ ప్రమాదంలో బలమైన గాయాలపాలై హైదరాబాద్ ప్రైవేట్ హాస్పిటల్ కాలుకు ప్లాస్టిక్ సర్జరీ కావడంతో విషయం తెలుసుకున్న డోర్నకల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే డి ఎస్ రెడ్యానాయక్ సక్రం ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కన్నీగుల్లా గ్రామం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నిమ్మల కోటేశ్వరరావు,మాజీ సర్పంచ్ అజ్మీర భారతి బాల్య, మాజీ ఉప సర్పంచ్ బాదావత్ మోహన్,అజ్మీర రవి నాయక్ సోషల్ మీడియా, తదిరులు పాల్గొన్నారు.

## పాలకుర్తి పోలీస్ స్టేషన్ ముందు నిప్పంటించుకున్న యువకుడు



జనగామ(గౌతమ్ న్యూస్): జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్ స్టేషన్ లో శుక్రవారం మధ్యాహ్నం సిబ్బంది అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడే సంఘటన జరిగింది. భార్యాభర్తల పంచాయతీ కోసం పోలీస్ స్టేషన్కు వచ్చిన ఓ వ్యక్తి అక్కడే ఒంటిపై పెట్రోల్ పోసుకొని పట్టించుకున్నాడు. అతన్ని అడ్డుకుబోయిన పోలీసు లకు ఆ నిప్పంటుకుని తీవ్ర గాయాలపాలయ్యారు. దీంతో స్పందించిన తోటి సిబ్బంది హుటాహుటీన క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. పాలకుర్తి మండలం కొండాపురం గ్రామ శివారు మేకలతండాకు చెందిన లాకవత్ శీను – అతని భార్య రాధిక మధ్య కొంతకాలంగా కుటుంబ కలహాలు చెలరేగుతు న్నాయి. భర్త వేధింపులు భరించలేక మనోవేధన గురైన రాధిక పాలకుర్తి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో శ్రీనును పోలీసులు పాలకుర్తి పోలీస్ స్టేషన్ పిలిపించారు. భార్యాభర్తలిద్దరికీ కౌన్సి లింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రములో ఒక్కసారిగా ఊగిపోయిన శ్రీనివాస్ తన వాహనంలోని పెట్రోలు తీసి తన ఒంటిపై కోసుకున్నాడు. అంతటితో ఆగకుండా వెంటనే నిప్పుంటించు కున్నాడు.అయితే ఇదంతా పోలీసుల ముందే జరగడం తో వెంటనే అప్రమత్తమ య్యారు. కాపాడబోయిన ఎస్సై సాయి ప్రసన్న కుమార్, కానిస్టేబుల్ రవీందర్కు ఆ మంటలు అంటుకున్నాయి. ఎస్సై సాయి ప్రసన్నకుమార్ చేతులకు తీవ్ర గాయాల య్యాయి. కానిస్టేబుల్ రవీందర్ చేతులు, కాళ్ళకు నిప్పు అంటుకుంది. గాయా లపాలైన శ్రీనుతోపాటు ఇద్దరు పోలీస్ సిబ్బందిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. పాలకుర్తి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనం తరం మెరుగైన చికిత్స కోసం శీను జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## వారి విషయంలో కీలక నిర్ణయం తీసుకున్న తెలంగాణ గవర్నర్



హైదరాబాద్, : తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కీలక నిర్ణయం తీసుకున్నారు. నిజామాబాద్‌లోని తెలంగాణ విశ్వవిద్యాలయం సహా వివిధ రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు వైస్-ఛాన్సలర్ పోస్టుల నియామకాలకు ఆమోదం తెలిపారు. ఈ ఏడాది మే నెలలో రాష్ట్రంలో యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల పదవీ కాలం ముగిసింది. దీంతో కొత్త వీసీల నియామకం కోసం ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. ఇప్పుడు నియామకాలు జరిగింది. అందుకు సంబంధించిన పత్రికా ప్రకటన విడుదలైంది. పాలమూరు యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా జీఎన్ శ్రీనివాస్ వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా కుమార్ మొగ్గారం కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా ఉమేష్ కుమార్ హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా నిత్యానందరావు నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా అల్తాఫ్ హుస్సేన్ -తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్ వైస్ ఛాన్సలర్‌గా యాదగిరిరావు హైదరాబాద్‌లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా రాజి రెడ్డి వివిధ యూనివర్సిటీల నియామకాల ప్రక్రియను తమ ప్రభుత్వం వేగవంతం చేస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టులోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు నియామకాలు జరిగాయి.

## యుద్ధానికి దిగిన కిమ్‌జొంగ్- రష్యాకు వేలాది సైనికులు



రష్యా-ఉక్రెయిన్ మధ్య రోజుల తరబడి హోరాహోరీగా యుద్ధం కొనసాగుతోంది. 2022 ఫిబ్రవరి 24వ తేదీన ఆరంభమైన ఈ యుద్ధానికి అంతం అనేది ఉండట్లేదు. ఇన్ని రోజులుగా నిరాటంకంగా ఈ రెండు దేశాలు తలపడుతూనే వస్తోన్నాయి. నువ్వా-నేనా అన్నట్టు సాగుతున్న ఈ పోరులో ఉక్రెయిన్‌లోని పలు నగరాలు ధ్వంసం అయ్యాయి. వందలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. అదే స్థాయిలో ఆస్తినష్టం సంభవించింది. అయినప్పటికీ ఏ దేశం కూడా వెనక్కి తగ్గట్లేదు. ఈ యుద్ధం వల్ల ఇప్పటికే ఉక్రెయిన్ తూర్పు ప్రాంతంలోని పలు నగరాలు నేలమట్టం అయ్యాయి. వాటిన్నింటినీ రష్యా సైనిక బలగాలు తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. మరియూపోల్, మెలిటోపోల్, క్రిమియా, డాన్‌బాస్, డొనెట్స్క్, లుహాన్స్క్, ఖేర్సన్, సుమి, ఒడెస్సా, చెర్నిహీవ్.. వంటి నగరాలను రష్యా సైనిక బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. పాశ్చాత్య దేశాల నుంచి ఎదురవుతోన్న ఒత్తిళ్లు, ఆంక్షలు, పలు రకాల నిషేధాలను కూడా రష్యా ధీటుగా ఎదుర్కొంటోంది. రష్యా సైన్యానికి ఉక్రెయిన్ అంత తేలిగ్గా తలవంచట్లేదు. ధీటుగా ఎదుర్కొంటోంది. కొన్ని సందర్భాల్లో పైచేయిని సాధించింది కూడా. రష్యా ఆధీనంలో ఉన్న కొన్ని కీలక నగరాలను విడిపించుకోగలిగింది. అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, ఆస్ట్రేలియా సహా యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలు అందిస్తోన్న ఆయుధాలు, యుద్ధ సామాగ్రితో రష్యా దూకుడుకు అడ్డుకట్ట వేయగలుగుతోంది. రాజధాని కీవ్‌ను స్వాధీనం చేసుకోవడానికి రష్యా సైన్యం చుట్టుముట్టినప్పటికీ..వారిని వెనక్కి పంపించగలిగింది. రోజులు గడుస్తున్నప్పటికీ ఉక్రెయిన్ అంత త్వరగా లొంగకపోవడం వల్ల రష్యా కీలక నిర్ణయాలను తీసుకుంది. ఈ యుద్ధంలో ఉత్తర కొరియా సహకారాన్ని తీసుకుంది. రష్యాకు మద్దతుగా 12,000 ట్రూప్‌లను ఉత్తర కొరియాకు రష్యాకు పంపించింది. ఈ విషయాన్ని దక్షిణ కొరియా ఇంటెలిజెన్స్ విభాగం వెల్లడించింది. ఉత్తర కొరియా పంపించిన ట్రూప్‌లో అత్యంత శక్తిమంతమైన స్పెషల్ ఆపరేషన్ ఫోర్సెస్ సైతం ఉన్నట్లు నిర్ధారించింది. ఈ మేరకు సియోల్ కేంద్రంగా పని చేస్తోన్న దక్షిణ కొరియా అధికారిక న్యూస్ ఏజెన్సీ యోన్‌హాప్ ప్రకటించింది. ఉత్తర కొరియాకు చెందిన 1,500 యుద్ధనౌకలు ఇప్పటికే రష్యా పోర్ట్ సిటీ వ్లాదివోస్టోక్‌కు చేరినట్లు వెల్లడించింది. రష్యా మిలటరీ యూనిఫాం ధరించి కొరియా సైనికులు ఉక్రెయిన్‌పై పోరాడే అవకాశం ఉందని యోన్‌హాప్ అంచనా వేసింది. నార్త్ కొరియా నుంచి బయలుదేరిన సైనికులు రష్యాలోని ఉస్సురియస్క్, ఖబరోవ్స్క్, బ్లాగోవెస్చెన్స్క్ వంటి నగరాలకు చేరుకున్నట్లు నిర్ధారించింది కూడా. ఈ సమాచారం వెలుగులోకి వచ్చిన వెంటనే దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్.. అత్యవసర సమీక్షను నిర్వహించారు. ఉత్తర కొరియా వంటి దేశం రష్యాకు మద్దతుగా ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగడం అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర ఆందోళనకరమని యూన్ సుక్ వ్యాఖ్యానించినట్లు యోన్‌హాప్ తెలిపింది. ఉత్తర కొరియా సైనిక బలగాలు ఇప్పటికే దేశం విడిచి వెళ్లిపోయాయని పేర్కొంది. మొదటి నుంచీ కూడా ఉక్రెయిన్‌కు నాటోతో సభ్యత్వాన్ని ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ వస్తోన్నారు ఉత్తర కొరియా అధినేత కిమ్‌జొంగ్ ఉన్. ఇదే విషయంపై రష్యాకు మద్దతు పలికారు. ఎలాంటి సహకారాన్నైయినా అందిస్తామంటూ గతంలోనే ప్రకటించారు. ఈ నేపథ్యంలో తాజాగా రష్యా నుంచి అందిన ప్రతిపాదనల మేరకు 12,000 ట్రూప్‌లను ఆ దేశానికి పంపించిందని దక్షిణ కొరియా పేర్కొంది.

## గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు గ్రీన్ సిగ్నల్: రిట్ పిటిషన్ కొట్టివేత

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ ను తెలంగాణ హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. సింగిల్ బెంచ్ తీర్పును సమర్థించింది. దీంతో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు లైన్ క్లియర్ అయింది. ఈ నెల 21 నుంచి 27 వరకు పరీక్షల నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. గ్రూప్-1 పరీక్షలకు 31,383 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలో 46 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### కోర్టుకు వెళ్లిన అభ్యర్థుల డిమాండ్ ఏంటి?

దివ్యాంగుల రిజర్వేషన్ కు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55ను సవరణ తీసుకువస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ను రద్దు చేయాలని కొందరు గ్రూప్-1 అభ్యర్థులు ఆందోళనకు దిగారు. జనరల్ కేటగిరీలోని అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించినవారిని అన్ రిజర్వ్ డ్ గా పరిగణించడంతో దివ్యాంగులకు అన్యాయం జరుగుతుందని వారి వాదన. జనరల్ అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు వచ్చినా రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద మెయిన్స్ కు పిలవాలనేది వారి డిమాండ్. దీన్ని దృష్టిలో ఉంచుకొని గ్రూప్-1 అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

### గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సర్వం సిద్ధం

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఆంక్షలు పెట్టారు.ఐదుగురికన్నా ఎక్కువ మంది గుమికూడవద్దని పోలీసులు హెచ్చరించారు.

## న్యాయదేవతకు 'కళ్ల గంతలు' తొలగింపు.. చారిత్రాత్మక ఘట్టం

### ఒక చేతిలో ఖడ్గం స్థానంలో రాజ్యాంగం ప్రతిమ ఏర్పాటు

### బ్రిటీష్ కాలం నాటి దుస్తుల స్థానంలో చీరకట్టుతో కొత్తగా రూపుదిద్దుకున్న న్యాయదేవత




హైదరాబాద్ (గౌతమ్ న్యూస్): బ్రిటీష్ కాలం నాటి పేర్లు, గుర్తుల సవరణల నేపథ్యంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కోర్టులు, లీగల్ ఛాంబర్లు, సినిమాలలో కళ్లకు గంతలు కట్టి కనిపించే 'న్యాయ దేవత' విగ్రహం రూపు మారింది. కళ్ల గంతలను సుప్రీంకోర్ట్ తొలగించింది. అంతేకాదు న్యాయ దేవత ఒక చేతిలో ఉండే ఖడ్గం స్థానంలో రాజ్యాంగ ప్రతిని ఉంచింది. బ్రిటీష్ కాలం నాటి దుస్తుల స్థానంలో చీరకట్టుతో విగ్రహాన్ని రూపొందించారు. ఈ మేరకు కొత్త విగ్రహాన్ని సుప్రీంకోర్టులోని న్యాయమూర్తుల లైబ్రరీలో ఏర్పాటు చేశారు. భారతీయ న్యాయవ్యవస్థ చిహ్నానికి కొత్త రూపును తీసుకురావడమే లక్ష్యంగా ఈ కీలక మార్పులు జరిగాయి. తద్వారా 'చట్టం ఇకపై గుడ్డిది కాదు' అని సుప్రీంకోర్ట్ స్పష్టమైన సందేశం ఇచ్చినట్టు అయింది. ఈ మార్పులు తీసుకొచ్చేందుకు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ చొరవ చూపించారు. మార్పుల అవసరాన్ని ఆయన గుర్తుచేశారు. కాగా మునుపటి న్యాయ దేవత విగ్రహం ఒక చేతిలో శిక్షకు చిహ్నంగా ఖడ్గం ఉండేది. దాని స్థానంలో అందరికీ సమానత్వాన్ని అందించే రాజ్యాంగాన్ని ఉంచారు. వలస వారసత్వాన్ని అధిగమించి ముందుకు వెళ్లాల్సిన తరుణం ఇదని సీజెఐ డీవై చంద్రచూడ్ భావించారని సుప్రీంకోర్ట్ వర్గాలు చెబుతున్నాయి. "చట్టం గుడ్డిది కాదు. అందరినీ సమానంగా చూస్తుంది" అని ఆయన అన్నారని సమాచారం. అందుకే న్యాయ దేవత కొత్త రూపంలో ఈ సూత్రం ప్రతిబింబించేలా చూసుకున్నారు.

# ముదురుపాకాన దౌత్యయుద్ధం



ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య కేసులో భారత దౌత్యాధికారులను 'పరిశీలించవలసి ఉన్న వ్యక్తుల జాబితా' లో కెనడా ప్రభుత్వం చేర్చడంతో అసలే అంతంత మాత్రంగా ఉన్న కెనడా- భారత్ సంబంధాలు మరింత క్షీణించాయి. కెనడా ప్రభుత్వ నిర్ణయంతో ఆగ్రహించిన భారత్.. ఆ దేశానికి చెందిన ఆరుగురు దౌత్యవేత్తలను దేశం విడిచి వెళ్లిపోవాలంటూ ఆదేశాలు జారీ చేయడంతోపాటు కెనడాలో ఉన్న భారత దౌత్యవేత్తలను వెనక్కి రప్పించాలని నిర్ణయం తీసుకుంది. బ్రిటిష్ కొలంబియాలోని ఒక గురుద్వారా వద్ద ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్‌ను గత ఏడాది గుర్తు తెలియని దుండగులు కాల్చిచంపారు. ఈ హత్యకు భారత ఏజెంట్లే కారణమంటూ కెనడా ప్రభుత్వం చేసిన ఆరోపణలు ఇరు దేశాల మధ్య అగ్గిరాజేశాయి. అది మొదలు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో అడపాదడపా భారత ప్రభుత్వంపై నోరు పారేసుకుంటున్నారు. నిజ్జర్ హత్య కేసులో తమ ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు అందించవలసిందిగా భారత ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులను పెడచెవిన పెడుతూ వస్తున్న ట్రూడో, భారత్‌పై తన విమర్శలకు పదను పెడుతున్నారే తప్ప, పకడ్బందీగా దర్యాప్తు జరిపి నిజానిజాలను వెలికితీసే ప్రయత్నం చేయడం లేదు. ట్రూడో 2015లో ప్రధానిగా అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ భారత ప్రభుత్వానికి వ్యతిరేక వైఖరినే అవలంబిస్తున్నారు. ఈ విషయంలో ఆయన తన తండ్రి, మాజీ ప్రధాని పిరే ట్రూడో అడుగుజాడల్లో నడుస్తున్నారు. 1985 లో ఎయిరిండియా విమానం కనిష్కను దారి మళ్లించి, లండన్‌లో దిగడానికి ముందు పేల్చివేసిన ఖలిస్థానీ ఉగ్రవాది పర్మార్‌ను పిరే ట్రూడో వెనకేసుకు వచ్చే ప్రయత్నం చేసి, ఇంటాబయటా అప్రదిష్టపాలయ్యారు. ఇప్పుడు ఆయన కుమారుడు జస్టిన్ ట్రూడో కూడా కెనడాలో తిష్ఠ వేసుకుకూర్చుని, భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఖలిస్థానీ నేతలకు కొమ్ముకాస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందునుంచే సిక్కు సంతతి ప్రజలు కెనడాకు వలసవెళ్లడం మొదలైంది. 1970 దశకంలో అక్కడి వలస చట్టాలను సరళతరం చేయడంతో సిక్కుల వలసలు మరింత పెరిగాయి. అదే సమయంలో ఖలిస్థాన్ ఉద్యమంపై భారత ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో అనేకమంది ఉగ్రవాద నేతలు కెనడాకు వలస వెళ్లిపోయారు. నిజ్జర్, పర్మార్ వంటి వారు ఆ కోవకే చెందినవారే. ప్రస్తుతం కెనడాలో ఏడున్నర లక్షల మందికి పైగా సిక్కులు నివసిస్తున్నారు. అక్కడి ఓటు బ్యాంకు రాజకీయాలపై సిక్కుల ప్రభావం ఎంతో ఎక్కువ. దీంతో అధికారంలోకి ఎవరు వచ్చినా సిక్కుల మద్దతుకోసం వెంపర్లాడటం పరిపాటిగా మారింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న లిబరల్ పార్టీ మంత్రివర్గంలో నలుగురు సిక్కులు ఉన్నారంటే సిక్కులకు ట్రూడో ప్రభుత్వం ఎంత ప్రాముఖ్యతనిస్తోందో అర్థం చేసుకోవచ్చు. సిక్కుల ఓటు బ్యాంకును సొంతం చేసుకునేందుకు ట్రూడో చేయవలసిందంతా చేస్తున్నారు. ఖలిస్థానీ ఉగ్రవాదుల కొమ్ము కాస్తూ, వారు అక్కడి హిందువులపైనా, హిందూ దేవాలయాలపైనా దాడులకు పాల్పడుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అంతేకాదు, భారత్‌ను వేధించేందుకు విదేశీ విద్యార్థులకు ఇచ్చే స్టడీ పర్మిట్లపైనా కెనడా కోత విధిస్తోంది. అమెరికా తరువాత భారతీయ విద్యార్థుల సంఖ్య కెనడాలోనే ఎక్కువ. గత పదేళ్లలో కెనడాలో భారతీయ విద్యార్థుల సంఖ్య ఏకంగా 260 శాతం పెరిగిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. కెనడాలో వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ట్రూడో నాయకత్వంలోని లిబరల్ ప్రభుత్వం వెనుకంజలో ఉన్నట్లు తాజా సర్వేలు చెబుతున్నాయి. దీంతో దిద్దుబాటు చర్యలకు దిగిన ట్రూడో, భారత్‌పై వేధింపు చర్యలకు పాల్పడుతూ, సిక్కు ఓట్లు కొల్లగొట్టేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. భారత దౌత్యాధికారులను నిజ్జర్ హత్య కేసులో ఇరికించేందుకు పూనుకోవడం ఇందులో భాగమే. తమ దేశంలోని ఖలిస్థానీ వేర్పాటువాదులను భారత ఏజెంట్లు లక్ష్యంగా చేసుకున్నారని, బిష్ణోయ్ గ్యాంగ్ సహకారంతో వారిని తుదముట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు తాజాగా ఆరోపించినా, అందుకు తగిన ఆధారాలను మాత్రం చూపించకపోవడం ప్రభుత్వం ఒంటెత్తు పోకడలకు నిదర్శనం. కెనడాలో స్థిరనివాసం ఏర్పరచుకుని భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను ఎగదోస్తున్న ఖలిస్థానీ ఉగ్రవాదులను అప్పగించాలంటూ భారత ప్రభుత్వం పదేపదే చేస్తున్న విజ్ఞప్తులను పెడచెవిన పెడుతూ, ఒక ప్రణాళిక ప్రకారం భారత్‌పై విషం కక్కుతున్న ట్రూడో వైఖరి గర్హనీయం.

# ఇది గిరిజనుల విజ్ఞతకు పరీక్ష



ఖనిజ సంపదకు నెలవైన గిరిజన జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల సంగ్రామం ఈసారి హోరాహోరీగా ఉండే పరిస్థితి ఏర్పడింది. గతంలో ఒకసారి ఎదురైన పరాజయంతో బిజెపి ఈసారి ఎలాగైనా జార?ండ్ కోటపై జెండా ఎగురవేయాలన్న గట్టి పట్టుదలతో ఉంది. మరోవైపు అధికారంలో ఉన్న జార?ండ్ ముక్తి మోర్చా కాంగ్రెస్ కూటమి ఆదివాసీల హక్కులను పరిరక్షించుకోవడమే కాక, ప్రాంతీయ స్వయం ప్రతిపత్తిని నిలబెట్టుకోవాలని ఆకాంక్షిస్తోంది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 81 స్థానాల్లో 72 చోట్ల బిజెపి పోటీ చేసి 37 స్థానాలను దక్కించుకోగలిగింది. మిత్రపక్షం ఆల్ జార?ండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఎజెఎస్‌యు) దక్కించుకున్న ఐదు స్థానాలను కలుపుకుని మెజార్టీ మార్కుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. కానీ స్వయంకృతాపరాధాలతో నిలదొక్కుకోలేక 2019లో పరాజయం పాలైంది. 2015 2020 మధ్య గిరిజనేతర నాయకత్వంతో దెబ్బతిన్న బిజెపి ఈసారి స్థానిక వర్గాలతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఎజెఎస్‌యుతో మిత్రత్వం పెంపొందించుకుని గిరిజన తెగల్లో ప్రధానమైన కుర్మీ ఓట్లను కొల్లగొట్టడానికి పావులు కదుపుతోంది. జార?ండ్‌లో కుర్మీ, సంథాల్ పరగణా గిరిజన తెగల ప్రభావం ఎక్కువ. వీరి ఓట్లే విజయం నిర్ణయించడంలో కీలక పాత్ర వహిస్తాయి. సంథాల్ పరగణా రీజియన్‌లో 18 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఈ రీజియన్‌లో మొదటి నుంచి జెఎంఎంకు గట్టిపట్టుంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రీజియన్‌లో జెఎంఎం 9 స్థానాలు, కాంగ్రెస్ 5, బిజెపి 4 స్థానాలు దక్కించుకున్నాయి. అయితే ఇక్కడ బలమైన కుర్మీలు ప్రస్తుతం వెనుకబడిన వర్గాల జాబితాలోనే ఉన్నారు. తమను షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చాలని గత కొన్నేళ్లుగా వీరు డిమాండ్ చేస్తున్నారు. 2004, 2015లో అప్పటి జార?ండ్ ప్రభుత్వాలు కుర్మీలను షెడ్యూల్డ్ తెగగా గుర్తించాలని కేంద్రానికి సిఫార్సు చేసినా, కేంద్రం వ్యతిరేకించింది. ఈసారి బిజెపికి ఇది ప్రధాన సమస్య కానుంది. అవినీతి కేసులో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కొన్నాళ్లు జైలు జీవితం గడిపినా, ఆ ప్రభావం రాష్ట్రంలో కనిపించడం లేదు.



గిరిజన వర్గాల్లో సోరెన్‌కు ఉన్న పలుకుబడి తగ్గలేదు. అక్రమ ఆస్తుల కేసులో హేమంత్ అరెస్ట్ వ్యవహారం చూపించి, గిరిజనుల ఆత్మగౌరవ అంశాన్ని ఈ ఎన్నికల్లో బలంగా లేవనెత్తాలని జెఎంఎం ప్రయత్నిస్తోంది. సంథాల్ పరగణా లాంటి గిరిజన మారుమూల ప్రాంతాల్లో తమకు ఢోకా లేకున్నా పట్టణ ప్రాంతాల్లో బిజెపిని గట్టిగా ఢీకొట్టేందుకు కాంగ్రెస్ సహాయం తనకు ఉపయోగపడుతుందని జెఎంఎం నాయకత్వం విశ్వసిస్తోంది. అయితే రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయిన గిరిజన నాయకుడు బాబూలాల్ మరాండీ ప్రతిపక్ష నేతగా బిజెపికి గట్టి మద్దతు ఇస్తుండడం బిజెపికి కలిసివచ్చిన అంశం. జార?ండ్ ఆదివాసీల, బలహీన వర్గాల ఉనికిని, హక్కులను రక్షించుకోవడమే తమ ప్రధాన లక్ష్యంగా జెఎం ఎం ప్రచారం సాగిస్తోంది. ఇదే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ రాజకీయ సిద్ధాంత పునాదిగా ఉంటోంది. బిజెపి హిందుత్వ, కార్పొరేట్ అనుకూల విధానాలను ఎండగడుతున్నారు. మహిళా ఓటర్లను ఆకట్టుకోడానికి మయ్యా సమ్మాన్ యాత్ర ప్రారంభించారు. మయ్యా సమ్మాన్ యోజన పథకం కింద 18 నుంచి 50 ఏళ్ల మహిళలకు నెలకు రూ. 1000 నగదు పంపిణీ అవుతుందని స్పష్టం చేశారు. 2021 జనాభా లెక్కల్లో సర్నా అనే ప్రత్యేక గిరిజన మతస్థులను చేర్చడానికి వీలుగా సర్నాకోడ్‌పై 2020లో అప్పటి జార?ండ్ ముక్తిమోర్చా ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపించినట్టు గుర్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా బిజెపి తన 'పంచ్‌ప్రాణ్ ' పేరిట వాగ్దానాలు చేసి సంక్షేమ పథకాల ప్రచారం సాగిస్తోంది. జెఎంఎం ప్రభుత్వం ఎంతవరకు తన హామీలను నెరవేర్చిందో చెప్పాలని ఓటర్లను 'మిలా క్యా' (హామీలు ఏమైనా నెరవేరాయా) అని ప్రశ్నిస్తోంది. రాష్ట్ర ఖనిజ సంపద సమర్థ నిర్వహణ, సంరక్షణ, రాయితీల పంపిణీ, ఆర్థికాభివృద్ధి తమ ప్రధాన లక్షాలుగా చెబుతోంది. జెఎంఎం నేతృత్వంలోని ఖనిజ వనరుల అజమాయిషీ అస్తవ్యస్తంగా సాగుతోందని, తాము అధికారంలోకి వస్తే కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం డబుల్ ఇంజిన్‌గా పని చేసి అభివృద్ధిని చూపిస్తామని బిజెపి చెబుతోంది. అయితే రాష్ట్రానికి అక్రమ వలసలు తీవ్ర సమస్యగా తయారైంది. ఈ విషయంలో జెఎంఎం ఘోరంగా విఫలమైందని బిజెపి ధ్వజమెత్తుతోంది. దీనికి తోడు యువకులకు ఉద్యోగాల కల్పనలో వెనుకబాటుతనం, అవినీతిని నివారించలేకపోవడం ఇవన్నీ జెఎంఎం లోపాలుగా కనిపిస్తున్నాయి. జార?ండ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 13, 20 తేదీల్లో జరుగుతాయి. నవంబర్ 23న వెలువడనున్న ఫలితాల్లో ఓటర్లు మళ్లీ ఇదే ప్రభుత్వాన్ని గెలిపిస్తారో లేదా మార్పును కోరుకుంటున్నారో గిరిజనుల విజ్ఞతకే ఇది పరీక్షగా మారింది.

# ప్రమాదకర ప్రతిపాదన



అలాంటివారి పనిబట్టడానికి రకరకాల చట్టాలున్నాయి. ఆహారకల్తీని అరికట్ట డానికీ, హానికరమైన, కాలంచెల్లిన పదార్థాల విక్రయాన్ని నిరోధించటానికీ హోటళ్లపై, ఇతర దుకాణాలపై విజిలెన్సు విభాగాలు దాడులు నిర్వహిస్తుంటాయి. కేసులు పెడతాయి. అయితే ఇదంతా ఒక క్రమపద్ధతిలో జరగటం లేదని, ప్రభుత్వాలు మొక్కుబడిగా ఈ పనిచేస్తుంటాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఆహారం తిని అస్వస్థతకు గురయి పదుల సంఖ్యలో జనం ఆస్పత్రుల పాలైనప్పుడు ఆదరాబాదరాగా చర్యలు తీసుకోవటం కూడా కనబడుతుంటుంది. హఠాత్తుగా యూపీ సర్కారు ఈ చర్య తీసుకోవటం వెనక ఇలాంటి ఘటన ప్రభావం ఏమైనా ఉందా? పోనీ ఈ మాదిరి ఉదంతాల కారణంగా జనం తరచూ అస్వస్థులవుతున్న లేదా మరణిస్తున్న ఉదంతాలేమైనా గమనించారా? అసలు ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ అధికారంలోకొచ్చాక ఎన్ని హోటళ్లపై, తినుబండారాల విక్రయ సంస్థలపై దాడులు నిర్వహించారు? అక్రమాలకు పాల్పడ్డారని తేలిన ఎంతమందిని శిక్షించారు? ఈ క్రమంలో ప్రస్తుత చట్టాలు నిరుపయోగంగా ఉన్నాయని భావిస్తే తగిన డేటాతో ఆ వివరాలు ప్రజల ముందు ఉంచొచ్చు. అప్పుడు ఒక సమగ్రమైన చట్టం అవసరమేనని అందరూ భావిస్తారు. కానీ యూపీలో జరుగుతున్నది అది కాదు. ఫలానా వర్గంవారు విక్రయించే పండ్లు లేదా ఇతర ఆహారపదార్థాలు అపరిశుభ్రంగా ఉంటాయని, వాటిని కలుషితం చేసి అమ్ముతున్నారని ఆరోపిస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది. వాటి ఆధారంగా ప్రభుత్వం ఈ ఆర్డినెన్సులు తీసుకొస్తున్నట్టు కనబడుతోంది. దుశ్చర్యలకు పాల్పడేవారికి మతం, కులం ఉండవు. ఎక్కడో ఒకచోట జరిగిన ఘటనను వీడియో తీసి ఫలానా మతం వారంతా ఇలాగే చేస్తున్నారని వదంతులు వ్యాప్తిచేయటం విద్వేషాలు రెచ్చగొట్టడానికే తోడ్పడతాయి. ఇదే యూపీలోని ఘజియాబాద్‌లో ఒక వ్యాపారి ఇంట్లో ఎనిమి దేళ్లుగా వంట మనిషిగా పనిచేస్తున్న రీనా కుమార్ అనే యువతి రోటీల్లో మూత్రాన్ని కలుపుతోందని ఆరోపిస్తూ పోలీసులు బుధవారం అరెస్టు చేశారని మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ మధ్య తెలంగాణలో అధికారులు వరస దాడులు నిర్వహించినప్పుడు అనేక హోటళ్లు, తినుబండారాల దుకాణాలు పాచిపోయిన పదార్థాలను అమ్ముతున్నాయని తేలింది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిలో అన్ని మతాలకూ చెందినవారూ ఉన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో ఘనంగా జరిగే కావడ్ యాత్ర సమయంలో ఆ మార్గంలోని దుకాణాల్లో విక్రయదారులు తమ పేర్లు, ఇతర వివరాలు కనబడే బోర్డులు ప్రదర్శించాలని పోలీసులు మొన్న జూలైలో నోటీసులిచ్చారు. కావడ్ యాత్రికులు 'స్వచ్ఛమైన శాకాహారులు' గనుక అపశ్రుతులు చోటుచేసుకోకుండా ఈ పని చేశామని సంజాయిషీ ఇచ్చారు. దాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దుకాణంలో నచ్చిన, నాణ్యమైన, రుచికరమైన ఆహారం దొరుకుతున్నదో లేదో వినియోగదారులు చూస్తారు తప్ప, వాటి విక్రయదారు ఎవరన్నది పట్టించుకోరు. అలా పట్టించుకోవాలని యూపీ ప్రభుత్వం తహతహలాడుతున్నదని తాజా నిర్వాకం గమనిస్తే అర్థమవుతుంది. వినియోగదారుల విశ్వాసాన్ని పరిరక్షించటమే ఆర్డినెన్సుల ఉద్దేశమన్న ప్రభుత్వ వాదన నమ్మదగ్గదిగా లేదు. ఆ పని విక్రయదారులది! వారిలో అక్రమార్కులుంటే చర్య తీసుకోవటానికి ఇప్పుడున్న చట్టాలు సరిపోతాయి. చెదురుమదురుగా జరిగిన ఉదంతాలను భూతద్దంలో చూపి జనాన్ని కలవరపెట్టడం సబబు కాదు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వెనకున్న స్ఫూర్తి అర్థం చేసుకుంటే యూపీ ప్రభుత్వం ఇలాంటి ఆర్డినెన్సుల ఆలోచన చేసేది కాదు. యూపీలో గోసంరక్షణ, లవ్ జీహాద్ తదితర ఆరోపణలతో గుంపు దాడులు, గృహదహనాలు, హత్యోదంతాల వంటివి జరిగాయి. నిందితుల ఇళ్లూ, దుకాణాలూ బుల్‌డోజర్లతో నేలమట్టం చేయటం కూడా రివాజుగా మారింది. ఎన్‌కౌంటర్లు సరేసరి. ఆర్డినెన్సుల ప్రతిపాదన ఆ క్రమంలో మరో చర్య కావొచ్చన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధి కరువైందని యువత... ధరలు ఆకాశాన్నంటాయని సామాన్యులు మొత్తుకుంటున్నారు. విద్య, వైద్య రంగాలు పడకేశాయని గగ్గోలు పెడుతున్నారు. వీటిపై సమర్థవంతంగా వ్యవహరించి ప్రజల విశ్వా సాన్ని పొందాల్సివుండగా, ప్రజల్లో పరస్పర అవిశ్వాసాన్ని కలిగించే ఇలాంటి పనులకు పూను కోవటం ఏం న్యాయం? అసలు నేరానికి తగ్గ శిక్ష ఉండాలన్న ఇంగితం కరువైతే ఎలా? ఆర్డినెన్సుల ప్రతిపాదనపై యూపీ సర్కారు పునరాలోచన చేయాలి.

విజ్ఞత మరిచినచోట విపరీతాలు చోటుచేసుకోవటంలో వింతేమీ లేదు. కావడ్ యాత్ర సందర్భంగా జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వులను నిలిపివేస్తూ సర్వోన్నత న్యాయస్థానం మొన్న జూలైలో ఇచ్చిన తీర్పు అర్థం కాకనో లేక దాన్ని ధిక్కరించే ఉద్దేశమో... ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రెండు ఆర్డినెన్సులు తీసుకురావాలని తాజాగా నిర్ణయించింది. ఆహారంలో లేదా పానీయాల్లో ఉమ్మివేయటం లేదా మానవ వ్యర్థాలతో దాన్ని కలుషితపరచటం పదేళ్ల శిక్షకు అర్హమయ్యే నాన్ బెయిలబుల్ నేరంగా పరిగణించటం, విక్రయదారుల పూర్తి వివరాలు అందరికీ కనబడేలా చేయటం ఈ ఆర్డినెన్సుల ఉద్దేశం. ఇప్పుడున్న చట్టం ప్రకారం కల్తీ కారణంగా మరణం సంభవిస్తే బాధ్యులైనవారికి మూడేళ్ల కఠిన శిక్ష విధించవచ్చు. తినే ఆహారపదార్థం రుచిగా, పరిశుభ్రంగా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరు కుంటారు. అలాంటి ఆహారం దొరికేచోటకే వెళ్తారు. హోటళ్లు మొదలుకొని సైకిళ్లపై తిరుగుతూ అమ్ముకునే విక్రయదారుల వరకూ అందరూ కమ్మనైన ఆహారపదార్థాలు వడ్డించి వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. ఒకవేళ ఎవరైనా లాభార్జనకు కక్కుర్తిపడి నాసిరకం పదార్థాలను అంటగడితే

## సందడి చేస్తున్న ఒపీనియన్ పోల్స్..గెలుపు ఎవరిదంటే..?



అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 5న జరగనున్నాయి. డెమొక్రాటిక్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిగా కమలా హారిస్ బరిలో ఉండగా... డొనాల్డ్ ట్రంప్ రిపబ్లిక్ పార్టీ నుంచి పోటీలో ఉన్నారు. ఇక ఎన్నికల ప్రచారాన్ని ఇరు అభ్యర్థులు హోరెత్తిస్తున్నారు. అక్కడి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు హామీల వర్షం కురిపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఒపీనియన్ పోల్స్ సందడి చేస్తున్నాయి. ఇంతకీ ఒపీనియన్ పోల్స్ ఎవరు గెలుస్తారని జోస్యం చెబుతున్నాయి.. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు ఒపీనియన్ పోల్స్ సందడి చేస్తున్నాయి.బెట్టింగ్ మార్కెట్స్ ట్రంప్ అధికారం చేపడతారని కోడై కూస్తున్నాయి. పాలీ మార్కెట్ అనే సంస్థ వెలువడించిన ఒపీనియన్ పోల్స్ ప్రకారం అమెరికా అధ్యక్ష పీఠం ట్రంప్‌నే వరిస్తుందని పేర్కొంది. జో బైడెన్ అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి తప్పుకున్నప్పటి నుంచి ట్రంప్‌కు కలిసొచ్చిందని వివరించాయి. ట్రంప్‌కు అధ్యక్షుడయ్యే అవకాశాలు 60శాతం మేరా మెరుగయ్యాయని పేర్కొంది.ఇంకా అర్థమయ్యేలా చెప్పాలంటే ప్రతి 100 ఓట్లలో 60 ఓట్లు ట్రంప్‌కే వస్తాయని ఒపీనియన్ పోల్స్ జోస్యం చెప్పాయి. ట్రంప్ విజం సాధిస్తారని పలు మార్కెట్లు కూడా అభిప్రాయపడుతున్నాయి. ఉదాహరణకు బెట్‌ఫెయిర్ అనే సంస్థ ట్రంప్ గెలుపు అవకాశాలు 58శాతం ఉన్నాయని అంచనా వేస్తుండగా.. కల్షి పెగ్స్ 57శాతం,ప్రెడిక్టిక్ 54శాతం స్మార్కెట్స్ 58శాతం అంచనా వేశాయి.జూలై నెలలో 48శాతంగా గెలుపు అవకాశాలు ట్రంప్‌కు ఉండగా... సెప్టెంబర్ చివరికి 57శాతానికి ఎగబాకింది. ఇదిలా ఉంటే పోలింగ్ డేటా ఫైవ్ థర్టీ ఎయిట్ మాత్రం మరోలా జోస్యం చెప్పింది. ఈ సంస్థ ప్రకారం కమలా హారిస్ స్వల్ప తేడాతో అధికారం చేపట్టే అవకాశాలున్నాయని పేర్కొంది. కమలా హారిస్ విన్నింగ్ ఛాన్సెస్ 48-49శాతం ఉండగా... ట్రంప్‌కు 46-47శాతంగా ఉన్నట్లు పేర్కొన్నాయి. అయితే ఏడు రాష్ట్రాల్లోనే అసలు సిసలైన పోరు కనిపిస్తోంది. ఇక్కడే ట్రంప్ కాస్త ముందంజలో ఉండే అవకాశం ఉంది. ఇక ట్రంప్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఆయన వ్యాపారాలకు సంబంధించిన స్టాక్స్ ఒక్కసారిగా రయ్ మని దూసుకెళుతున్నాయి. ముఖ్యంగా ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్‌లకు చెందిన షేర్లు అక్టోబర్‌లో 86శాతం మేరా పెరిగాయి. ట్రంప్ గెలుస్తాడన్న ధీమా ఉండటంతోనే స్టాక్స్ రేట్ పెరుగుతోందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు ఇన్వెస్టర్లు. ట్రంప్ అధికారంలోకి వస్తారన్న వార్తలు ప్రచారంలో ఉండటంతో బ్యాంకింగ్, క్రిప్టో కరెన్సీ షేర్లు కూడా మార్కెట్‌లో చక్కటి ప్రదర్శన కనబరుస్తున్నాయి.

## సెక్యూరిటీ లేకుండా మూసీ ప్రాంతంలో తిరిగి చూపించు..

### సీఎం రేవంత్‌కు మాజీమంత్రి సవాల్



**హైదరాబాద్, :** రేవంత్ వ్యాఖ్యలు సీఎం స్థాయిని దిగజార్చేలా ఉన్నాయని మాజీమంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. మూసీ సుందరీకరణ పై సీఎం రేవంత్ వ్యాఖ్యలు, రాష్ట్ర అప్పులు, గ్రూప్-1 అంశంపై ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల పరువు పోయేలా రేవంత్ ఉపన్యాసాలు ఉన్నాయన్నారు. రేవంత్ వ్యక్తిగా పరువు పోగొట్టుకుంటే ఫర్వాలేదు.. తెలంగాణ సీఎంగా పరువు పోతే ఎవరికి నష్టం అని ప్రశ్నించారు. ఎవరో రాసిచ్చిన పాఠం చదవడం రేవంత్ మానేస్తే మంచిది.. సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయన్నారు. తెలంగాణా ఆదాయం పెంచింది కేసీఆర్ అని అన్నారు. 2014 బడ్జెట్.. ఇప్పటి బడ్జెట్ చూస్తే ఎవరు ఆదాయం పెంచారో తెలుస్తుందన్నారు. అప్పులు మంత్రుల జేబులో నుండి కడుతున్నట్లు అతితెలివిగా మాట్లాడుతున్నారన్నారు. మేము కూడబెట్టిన ఆదాయం నిలబడితే చాలు అన్నారు. 420 హామీలొద్దు, కనీసం కేసీఆర్ ఇచ్చిన పథకాలైనా ఇస్తే చాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర ఆదాయం, అప్పుల పై చర్చకు సిద్ధమేనన్నారు. సెక్యూరిటీ లేకుండా సీఎం రేవంత్ రెడ్డి మూసీ ప్రాంతంలో తిరిగి చూపించాలని సవాల్ విసిరారు. మూసీ కూల్చివేతల తరువాత సెక్యూరిటీ పెంచుకుని ప్రగల్భాలు పలుకుతున్నారని అన్నారు. ఆశోక్ నగర్ నిరుద్యోగుల వల్లే రేవంత్ కి అధికారం వచ్చిందన్నారు. ఇప్పుడు అశోక్ నగర్ పేరు వింటే రేవంత్ కి భయమేస్తోందన్నారు. అశోక్ నగర్ లో పోలీస్ నిర్బంధం దేనికి అని ప్రశ్నించారు. యువత ఆవేశం ఇలానే కొనసాగితే తెలంగాణ మొత్తం అశోక్ నగర్లే అవుతాయన్నారు. నిర్బంధం పెట్టే బదులు అనుమానాలు నివృత్తి చేయండన్నారు. కాంగ్రెస్ సీనియర్లే సీఎం ఏకపక్షంగా వెళు_న్నారని అంటున్నారు. ఇప్పటికే ప్రజల నుండి దూరమౌతున్న రేవంత్.. దూకుడు మానకపోతే పార్టీకి దూరమౌతావ్ అని హెచ్చరించారు.

## సేవింగ్స్ అకౌంట్స్‌లో నగదుకు లిమిట్..

# లేకుంటే ఐటీ నోటీసులు తప్పదు



**న్యూఢిల్లీ,:** ఇటీవల కాలంలో పరిస్థితులన్నీ పూర్తిగా మారిపోయాయి. ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు, పాన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ కంపల్సరీ అయిపోయింది. బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయాలంటే.. ఖాతాదారుడికి ఖచ్చితంగా ఆధార్, పాన్ కార్డు ఉండి తీరాలి. అలా అయితేనే బ్యాంక్‌లో ఖాతా తెరుస్తున్నారు. అయితే బ్యాంక్ ఖాతాల్లో వివిధ రకాలు ఉన్నాయి. సేవింగ్ అకౌంట్, కరెంట్ అకౌంట్, శాలరీ అకౌంట్ తదితర రకాలున్నాయి. కానీ చాలా మంది సేవింగ్ అకౌంట్‌లనే ఒపెన్ చేస్తారు. అత్యధిక శాతం ఖాతాదారులు.. తాము సంపాదించిన నగదును ఈ ఖాతాల్లోనే పొదుపు చేస్తుంటారు. ఈ సేవింగ్ అకౌంట్లలో నగదు భద్రపరచడమే కాకుండా.. దీనిపై వడ్డీని సైతం పొందవచ్చు. మరికొన్ని సమయాల్లో.. ఇతరుల నగదును తమ ఖాతాల ద్వారా ఖాతాదారుడు లావాదేవీలు జరుపుతుంటాడు. అలాంటి వేళ సేవింగ్ అకౌంట్ పరిమితి దాటుతుంది. అసలు సేవింగ్ అకౌంట్‌లో లిమిట్ ఎంత ఉండాలి. ఈ అకౌంట్‌లో ఎంత నగదు జమ చేసుకోవచ్చు. ఓ వేళ ఆ పరిమితి దాటితే ఖాతాదారుడికి ఏమైనా ఇబ్బందులు ఎదురవుతాయా? అంటే.. ఎదురయ్యే అవకాశాలున్నాయి. సేవింగ్ అకౌంట్లలో దాచుకునే సొమ్ము పరమితి దాటితే మాత్రం ఖాతాదారుడికి ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు వచ్చే అవకాశముంది. మరి అలా కాకూడదంటే.. సేవింగ్ అకౌంట్‌లో ఎంత నగదు ఉంచవచ్చు. అంటే.. సేవింగ్ అకౌంట్‌లో ఎంత నగదు అయినా జమ చేసుకోవచ్చు. అందుకు పరిమితి లేదు. కానీ ఆదాయపు పన్ను శాఖ.. ఒక ఆర్థిక సంవత్సరంలో సేవింగ్స్ అకౌంట్‌లో నగదు జమ చేసేందుకు రూ.10 లక్షల వరకు పరిమితి విధించింది. అంటే ఒక ఏడాదిలో బ్యాంక్ సేవింగ్ అకౌంట్‌లో రూ.10 లక్షల వరకు నగదు జమ చేయవచ్చు. ఆపై నగదు జమ చేస్తే మాత్రం ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చేస్తారు. దాంతో జమ అయిన నగదుపై పన్ను చెల్లించవలసి ఉంటుంది. సేవింగ్స్ అకౌంట్స్‌లో నగదు పరిమితికి మించి జమ అయితే మాత్రం బ్యాంకులు.. ఆదాయపు పన్ను శాఖ దృష్టికి తీసుకు వెళ్తాయి. దీంతో ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 285 బీఏ నిబంధనల ప్రకారం.. మీ ఖాతాలో జమ అయిన నగదు వివరాలను ఆ శాఖ పరిశీలిస్తుంది. దీంతో సేవింగ్ అకౌంట్‌లో జమ అయిన నగదుకు.. రిటర్న్ ఫైల్ చేసే సమయంలో చూపిన వివరాలు కచ్చితంగా ఉండాలి. ఏ మాత్రం పొంతన లేకుంటే మాత్రం ఆదాయపు పన్ను శాఖ నోటీసులు జారీ చేస్తుంది. దీంతో ఖాతాదారుడు.. ఆ నగదుకు సంబంధించిన కచ్చితమైన వివరాలు ఆదాయపు పన్ను శాఖ వారికి సమర్పించాల్సి ఉంటుంది. ఆ క్రమంలో నగదు రాబడి అంశంలో ఏ మాత్రం తప్పు జరిగినట్లు భావించినా.. ఆదాయపు పన్ను శాఖ కఠిన నిర్ణయం తీసుకునే అవకాశముంటుంది. దీంతో జరిమానాతోపాటు చట్టపరమైన చర్యలకు సైతం ఆ శాఖ ఉపక్రమించే అవకాశముంది. ఈ నేపథ్యంలోల సేవింగ్స్ అకౌంట్‌లో నగదు ఎంత ఉండాలనే విషయాన్ని ఖాతాదారుడు ముందే తెలుసుకుని మసులుకుంటే మంచిది.

# మానవతా ధార్మికుడు రతన్ టాటా



రతన్ టాటా మరణం యావత్ దేశాన్ని శోకసంద్రంలో ముంచేసింది. ఎంతోమంది తమ కుటుంబ సభ్యుణ్ణి కోల్పోయినట్టు బాధపడి, ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా వేదికగా తమ దుఃఖాన్ని వెలిబుచ్చారు. సాధారణ వ్యక్తులు సైతం టాటా సన్స్ గ్రూప్ గురించి తెలుసుకుని మరీ బాధపడటం టాటాలపై ఉన్న ప్రేమాభిమానాలకు నిదర్శనం. వ్యాపారాలు అందరూ చేస్తారు కానీ విలువలతో కూడిన వ్యాపారాలు చేస్తూ, సంపదను రోజురోజుకు పెంచుకోవడం ఒక ఎత్తు అయితే, వచ్చిన లాభాల్లో మళ్ళీ సమాజానికే సింహభాగం కేటాయించడం, నైతికత, విలువలతో వ్యాపారం చేయటం టాటా గ్రూప్ ప్రత్యేకత. ఇదే టాటాను ప్రపంచంలో ప్రత్యేకంగా నిలబెట్టింది.

ఇదొక్కటే కాదు సామాజిక అవసరాలు తీరుస్తూనే కాలానుగుణంగా వస్తున్న మార్పులతో పోటీపడి సామాన్య భారతీయుని కలలను సాకారం చేసేందుకు రతన్ టాటా తాపత్రయపడ్డారు. గుజరాత్‌లోని నవ్సారలో ఒక చిన్న బట్టల మిల్లుతో ప్రారంభమైన టాటాల ప్రస్థానం, నేడు ప్రపంచంలో వందకు పైగా దేశాల్లో అన్ని రంగాల్లో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి ప్రపంచమే అబ్బురపడేలా సాగుతోంది. గుజరాత్‌లో నూలు పరిశ్రమతో జంషెడ్‌జి టాటా గ్రూప్‌ను 1870లలో స్థాపించారు. ఆ తర్వాత ఈ గ్రూప్ ప్రస్థానం మనకు తెలియంది కాదు. ఒక్క టాటానే కాదు పార్శీలు అందరూ కష్టపడి పని చేయటంలోనూ, కాలానుగుణంగా మారడంలోనూ, వ్యాపార మెలకువల్లోనూ ప్రపంచంలోనే అగ్రగణ్యులు. ప్రస్తుతం మన దేశంలోని 145 కోట్ల మంది జనాభాలో పార్శీల జనాభా కేవలం 60 వేలు మాత్రమే. కానీ అనాదిగా దేశం కోసం విప్లవాత్మక మార్పులు తేవటంలో వారి పాత్ర అమోఘం. దేశంలో మొదటి బట్టల మిల్లు, మొదటి న్యూస్ పేపర్, మొదటి భారతీయ బ్యాంక్ స్థాపన పార్శీలే చేశారు. ముంబైలో సింహభాగం వ్యాపారాలే కాకుండా, ముంబైని ఆర్థిక రాజధానిగా మలిచింది కూడా పార్శీలే. కేవలం ఆర్థికంగానే కాక సాంఘిక రాజకీయ జీవనంలో కూడా వారి భాగస్వామ్యం వెలకట్టలేనిది. స్వాతంత్రోద్యమ కాలంలో కూడా ఫిరోజ్ షా మెహతా, దాదాబాయి నౌరోజీ లాంటి వారు, ప్రఖ్యాత సైంటిస్టు హోమి జహంగీర్ బాబా, పల్లోంజి మిస్త్రీ, గోద్రెజ్, పునావాల, వాడియాల కుటుంబాలు పార్శీలవే. ఇక జంషెడ్‌జి టాటా అయితే స్వామి వివేకానందతో చికాగో నుంచి చేసిన ప్రయాణమే తన వ్యాపార సామ్రాజ్యాన్ని మలుపు తిప్పిన ఇనుము ఉక్కు పరిశ్రమల స్థాపనకు ప్రేరేపించిందని చెప్పారు. స్వాతంత్ర్యం తరువాత జరిగిన అభివృద్ధిలో రతన్ టాటా నవభారత నిర్మాణానికి పునాదులు వేశారనడంలో సందేహం లేదు. ఆధునిక శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి అనుగుణంగా రోజురోజుకీ వస్తున్న మార్పులను టాటా గ్రూప్‌కు అన్వయిస్తూ ప్రపంచంలోని మేటి సంస్థలకు దీటుగా నిలుపుతూనే సగటు భారతీయుని ఆలోచనలను, ఆకాంక్షలను తీర్చేందుకు నిత్య శ్రామికుడిగా మారాడు. ఎంతలా అంటే తాను వివాహం చేసుకుంటే మళ్ళీ వ్యాపారానికి ఇచ్చే సమయం ఉండదేమో అన్నంతగా. రతన్ టాటా చూపిన దాతృత్వ మార్గం మాత్రం కార్పొరేట్ వ్యాపార సామ్రాజ్యంలో ప్రకంపనలు సృష్టించింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలలో భాగంగా పేదల కోసం ఎన్నో వినూత్న సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారాయన. కంపెనీ లాభాల్లో రెండు శాతమో, ఐదు శాతమో లాభాలను టర్నోవర్‌ను బట్టి వినియోగించాలని సీఎస్ఆర్ చట్టం రూపొందించినా, రతన్ టాటా మాత్రం ఏకంగా 50 నుంచి 60శాతం లాభాలను సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించటం నిజంగా ఆదర్శనీయం. విపత్తుల వేళ ఆయన చూపిన మానవతావాదం కార్పొరేట్‌లను విస్మయానికి గురిచేసింది. కరోనాకాలంలో పీఎమ్ కేర్స్‌కు ఏకంగా 1200 కోట్ల రూపాయలు విరాళంగా ఇవ్వడం, ఆయన చేతులకు ఎముకలు లేవని మరోమారు నిరూపిం చింది. దేశంలోని ప్రతి పౌరునికి టాటా గ్రూప్‌పై అభిమానం ప్రేమ కలిగేందుకు కారణం ఆయన చేసిన సామాజిక సేవా కార్యక్రమాలు. కార్పొరేట్ ఉద్యోగులకు, కంపెనీలకు సామాజిక స్పృహ ఉండాలని టాటా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ స్థాపించడం చూస్తే సేవా గుణాన్ని, దాతృత్వాన్ని వ్యవస్థీకృతం చేసేందుకు ఆయన పడ్డ తాపత్రయం అర్థమవుతుంది. గుండు పిన్ను నుంచి విమానాల వరకు ఆయన స్పృశించని రంగం అంటూ ఏదీ లేదు. వారసత్వ కట్టడాలను పరిరక్షించడం కోసం తాజ్ హోటల్స్ పేరుతో లాభాపేక్ష లేకుండా అందరూ సందర్శించేలా చేశారు. కార్పొరేట్ వ్యాపారాలకు మానవతా విలువలు జోడించి, విజయం సాధించిన ఆధునిక వ్యాపారవేత్త ఆయన. భవిష్యత్తు భారతాన్ని అంచనా వేసి వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. వేగంగా నడవాలంటే ఒంటరిగా, దూరం నడవాలంటే తోడుగా నడవాలన్న ఆయన మాటలు దూరదృష్టితో టాటాల సామ్రాజ్యం, దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చెప్పింది కావచ్చు. సామాన్య భారతీయుని కలల కారు ప్రయాణాన్ని లక్ష రూపాయలతో నానో కారు ద్వారా తీర్చి ఆయన సంచలనమే సృష్టించారు. నానో ద్వారా నష్టాలు వచ్చినా కష్టంగా భరించారు. ఇతర వ్యాపారాల్లో లాభాల ద్వారా ఈ నష్టాన్ని పూడ్చారే తప్ప సామాన్యుని కలలను మాత్రం చెరిపి వేయలేదు. ఆయన ఆచరించి చూపిన వ్యాపార మార్గం వ్యాపార నిర్వహణ శాస్త్ర విద్యార్థులకు, నిర్వాహకులకు పాఠాలుగా మిగిలిపోతాయి. దురదృష్టవశాత్తూ కమ్యూనిస్టు పార్టీలు అధికార పార్టీలను విమర్శించే క్రమంలో టాటాలకు, బిర్లాలకు దోచిపెడుతున్నారంటూ ఊతపదంగా వాడేవారు. టాటాలు ఎప్పుడు కూడా రాజకీయాలకు, వివాదాలకు దూరంగా ఉన్నారు. టాటా అంటేనే ట్రస్ట్, వ్యాపారం అంటే కేవలం ఆదాయం మాత్రమే కాదు అభిమానం, ఆత్మీయత అని నిరూపించారు రతన్ టాటా. భారతీయుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన మనసున్న వ్యాపారవేత్త. దేశం సంకట స్థితిలో ఉన్నప్పుడు ఆపన్న హస్తాన్ని అందించే నిర్మల దేశభక్తుడు. ఆదాయం కంటే ఆత్మసంతృప్తి ముఖ్యమని కోట్లాదిమంది భారతీయుల హృదయాలను దోచుకుని చాలా లాభాన్ని సంపాదించి మూటగట్టుకెళ్లిన నిజమైన భారతరత్నం.

# కమ్ముతున్న వాయు కాలుష్యం



శీతాకాలం సమీపిస్తుండటంతో ఢిల్లీ, హర్యానా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు మళ్లీ వాయు కాలుష్యానికి స్వాగతం ఇస్తున్నాయి. గత నెల ప్రధాని కార్యాలయం ఈ రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించింది. ఢిల్లీలో వాయు నాణ్యత క్షీణించకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించింది. వాహనాల కాలుష్యంతోపాటు, రోడ్లు, నిర్మాణాల దుమ్ముధూళి, ఘనవ్యర్థాల నిర్వహణ ఇవన్నీ గత కొన్నేళ్లుగా వాయు కాలుష్యానికి దారి తీస్తున్నాయని చర్చించారు. పంజాబ్, హర్యానాల్లో పంట వ్యర్థాలను మండించడం పెద్ద సమస్యగా తయారైంది. అక్టోబర్, నవంబర్ నెలలో కాలుష్యంలో 40% ఈ పంట వ్యర్థాలే కారణమవుతున్నాయి. ఈ ఏడాది పంజాబ్‌లో 19.52 మిలియన్ టన్నులు, హర్యానాలో 8 మిలియన్ టన్నుల వరి వ్యర్థాలను దగ్ధం చేస్తారని అంచనా. అయితే ఈ రెండు రాష్ట్రాలూ ఈ ఏడాది పంట వ్యర్థాలను దగ్ధం చేయకుండా నివారిస్తామని హామీ ఇచ్చాయి. గత ఏడాది నవంబర్‌లో సుప్రీం కోర్టు ఈ పంట వ్యర్థాల కాలుష్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పంట వ్యర్థాలను దగ్ధం చేయకుండా పూర్తిగా నిలువరించాలని ఆదేశించింది. ఈ ఏడాది రాష్ట్రాల సంగతి ఎలా ఉన్నా కేంద్రం తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వస్తోంది. 2023 పంటకోతల సీజన్‌లో పంజాబ్‌లో పంట వ్యర్థాల దగ్ధం సంఘటనలు 2022 తో పోలిస్తే 59% తగ్గాయి. అలాగే హర్యానాలో 2023లో 40% తగ్గాయి. కానీ ఉత్తరప్రదేశ్‌లో మాత్రం పంటవ్యర్థాల దగ్ధం సంఘటనలు 30% పెరగడం గమనార్హం. ఈ సమస్య నివారణకు ఆర్థిక రాయితీలు కల్పించడం, ఇతర చర్యలు తీసుకోవడం తప్పనిసరి. పంట వ్యర్థాలను 11.5 మిలియన్ టన్నుల వరకు దగ్ధం చేయకుండా పొలాల్లోనే వాటిని వినియోగించడం, మిగతా వ్యర్థాలను బయటకు తరలించడం చేస్తామని పంజాబ్ పేర్కొంది. దీంతో పాటు 2 మిలియన్ టన్నుల వరిగడ్డి వ్యర్థాలను ఎన్‌సిఆర్ రీజియన్‌లోని థర్మల్ పవర్ ప్లాంట్లలో మండించడానికి వినియోగిస్తున్నారు. అంటే వరిగడ్డి వ్యర్థాలను గుళికలుగా తయారు చేసి కార్బన్ వనరుగా వినియోగిస్తుంటారు. అయితే దీనికి కావలసిన యంత్రాలు రైతులకు అందుబాటులో లేవు. విద్యుత్ ప్లాంట్లలో పంట వ్యర్థాలను వినియోగించడం ఒక పరిష్కార మార్గమే అయినప్పటికీ, పొలం నుంచి పవర్‌ప్లాంట్‌కు ఈ వరిగడ్డి గుళికలను రవాణా చేసే వ్యవస్థ లేదు. పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కచ్చితమైన విధానాలు పాటించకపోవడం రైతులకు నష్టాలకు దారితీస్తోంది. సీజన్‌లో రెండు పంటలు వేస్తేనే కానీ తమకు నష్టాలు తీరవన్న ఉద్దేశంతో రైతులు వరిగడ్డిని దగ్ధం చేసి గోధుమ పంట సాగుకు సమాయత్తం అవుతుంటారు. అదే పంట వ్యర్థాల దగ్ధానికి దోహదమవుతోంది. వరికి బదులుగా పెసర వంటి పప్పు ధాన్యాల సాగును చేపట్టినా గిట్టుబాటు ధర లభించడం లేదు. అందువల్ల చేసేది లేక వరిని సాగు చేయవలసి వస్తోందని రైతులు చెబుతున్నారు. వరిగడ్డి దగ్ధం వల్ల ఉత్పన్నమయ్యే కాలుష్యాల నివారణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయాలను పక్కనపెట్టి సమష్టిగా కృషి చేస్తేనే కానీ సత్ఫలితాలు రావు. ఢిల్లీలో గత ఏడాది రికార్డు స్థాయిలో వాయు నాణ్యతా ప్రమాణాలు పడిపోయాయి. మళ్లీ గత కొన్ని రోజులుగా వాయు నాణ్యత క్షీణిస్తోంది. గత మూడు నెలల్లో మొదటిసారి ఎక్యూఐ (వాయు నాణ్యత ప్రమాణాలు) 200 నుంచి 300 మధ్యకు చేరుకుంది. ఐక్యూఎయిర్ 2023 నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక కాలుష్య దేశాల్లో మన దేశం మూడో స్థానంలో ఉంది. దేశంలో సగటున క్యూబిక్ సెంటీమీటర్‌కు ఎయిర్‌బోర్న్ పర్టిక్యులర్ మేటర్ (ఎం.పి) 2.5 మైక్రోగ్రామ్స్ గాను, గాఢత 54.4 మైక్రోగ్రామ్స్ గాను కొనసాగుతోంది. గాలిలో కాలుష్యానికి కారణమయ్యే వివిధ రకాల వాయువులు, రసాయనాల మిశ్రమాన్ని ఎంపిగా పేర్కొంటారు. వాయు కాలుష్యం కారణంగానే మన దేశంలో సగటున సంవత్సరానికి రూ. 2.7 లక్షల కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లుతోందని నివేదికలు చెబుతున్నాయి. స్థూల జాతీయోత్పత్తిలో ఇది 1.36 శాతం. వాహనాల నుంచి పరిశ్రమల నుంచి వెలువడే కర్బన ఉద్గారాలు, రసాయన వాయువులు, పరిశ్రమల నుంచి వెలువడే సల్ఫర్‌డైయాక్సైడ్, కార్బన్ డైయాక్సైడ్ కాలుష్యాలతో వాతావరణం పూర్తిగా కలుషితమవుతోంది. పంట వ్యర్థాలను దగ్ధం చేయడంతో శీతాకాలంలో ప్రజలకు శ్వాసకోశ సమస్యలు, గుండెజబ్బులు, అకాల మరణాలు సంభవిస్తున్నాయి. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సిఎపి) ప్రస్తుతం వాయు నాణ్యత పిఎంను 2.5 కంటే తగ్గించాలని లక్షంగా పెట్టుకుంది. ఈ లక్షంలో కనీసం 20నుంచి 40 శాతం వరకైనా 2026 నాటికి సాధించవలసి ఉంది. ఈ మేరకు లక్షాలను సాధించకపోతే ఢిల్లీలో ఎవరూ నివసించలేని దుర్భర పరిస్థితి దాపురిస్తుంది.

# అలవిమాలిన అలసత్వం



ఒకసారి జరిగితే పొరబాటు. అదే పొరబాటు రెండోసారి జరిగితే దాన్ని నిర్లక్ష్యం అనక ఇంకేమంటారు? ప్రపంచంలోనే అతి పెద్ద వ్యవస్థగా రికార్డులకు ఎక్కిన భారతీయ రైల్వే శాఖ ఒకదాని వెనుక ఒకటిగా చేస్తున్న తప్పిదాలు ప్రయాణికుల పాలిట ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. చెన్నై సమీపంలోని కవరైప్పెట్టై రైల్వేస్టేషన్ సమీపంలో మైసూరు- దర్భంగా భాగమతి ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైన తీరును గమనిస్తే, రైల్వే శాఖ నిర్లక్ష్యం పతాకస్థాయికి చేరిందని అనిపించక మానదు. ఎక్స్‌ప్రెస్ రైలుకు గ్రీన్ సిగ్నల్ ఉన్నప్పటికీ లూప్ లైనులోకి వెళ్లి, అక్కడ ఆగి ఉన్న గూడ్సు రైలును వెనుకనుంచి ఢీకొట్టిందన్నది రైల్వే ఉన్నతాధికారుల కథనం. ఈ ప్రమాదంలో 12 కోచ్‌లు పట్టాలు తప్పగా రెండింటికి నిప్పంటుకుంది. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడం సంతోషించదగిన విషయం. పండగ పూట జరిగిన ఈ ప్రమాదం కారణంగా వేలాది ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేక నానా అవస్థలూ పడ్డారు. అది అలా ఉంచితే, గత ఏడాది జూన్ నెలలో ఒడిశాలోని బాలసోర్ జిల్లా బాహానగా రైల్వే స్టేషన్ సమీపంలో సరిగ్గా ఇదే విధంగా ప్రమాదం జరిగింది. సిగ్నల్ ఉన్నప్పటికీ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు మెయిన్ ట్రాక్ నుంచి లూప్ లైన్‌లోకి మళ్లి, అక్కడ నిలిచిఉన్న గూడ్సు రైలును వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో కొన్ని బోగీలు పక్కనున్న ట్రాక్ మీద పడటంతో, అదే సమయంలో అటుగా వెళ్తున్న యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ కూడా ప్రమాదానికి గురైం ది. ఈ దుర్ఘటనలో 290 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ శతాబ్దంలో జరిగిన అతి ఘోర ప్రమాదాలలో ఒకటిగా పరిగణిస్తున్న ఒడిశా రైలు ప్రమాదం నుంచి రైల్వే శాఖ పాఠాలు ఏమీ నేర్చుకోలేదనడానికి కవరైప్పెట్టై ప్రమాదమే తాజా ఉదాహరణ. భారతీయ రైల్వే వ్యవస్థ రానురాను పేరు గొప్ప ఊరు దిబ్బ చందంగా మారుతోందనడానికి ఉదాహరణలు కోకొల్లలు. ప్రతి రోజూ రెండున్నర కోట్లమంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసే భారతీయ రైళ్లలో ప్రయాణికులకే కాదు, వాటిని నడిపే లోకో పైలట్లకు సైతం కనీస సౌకర్యాలు మృగ్యమవుతున్నాయి. పని గంటల భారం, రైల్వే రెస్ట్ రూముల్లో సౌకర్యాల లేమి వంటి సమస్యలు వారి పనితీరుపై ప్రభావం చూపిస్తున్నాయి. లోకో పైలట్లపైనే కాదు, ఇతర సిబ్బందిపైనా పని భారం పెరుగుతోంది. ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉన్న వేలాది పోస్టులను భర్తీ చేయకపోవడంతో సిబ్బందిపై పెనుభారం పడుతోంది. ఇక నాసిరకం సిగ్నలింగ్ వ్యవస్థ గురించి, అరకొరగా జరుగుతున్న ట్రాక్‌ల నిర్వహణ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. బ్రిటిష్ కాలంనాటి రైలు పట్టాలను పునరుద్ధరించవలసిన అవసరం ఉన్నా, ఆ దిశగా చేపడుతున్న చర్యలు అంతంతమాత్రమే. వాస్తవానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రైలు ప్రమాదాల నివారణకు రకరకాల అధునాతన పద్ధతులను రైల్వే శాఖ రూపొందించుకున్నా, వాటి అమలులోనే నిర్లక్ష్య వైఖరి ద్యోతకమవుతోంది. పొగమంచులో లోకో పైలట్లకు నావిగేట్ చేసేందుకు సహకరించే జిపిఎస్ ఆధారిత ఫాగ్ పాస్ పరికరం, లోపభూయిష్టమైన పట్టాలను గుర్తించేందుకు అల్ట్రాసోనిక్ ఫ్లా డిటెక్షన్ విధానం, పాయింట్లు, సిగ్నళ్లను నియంత్రించేందుకు ఇంటర్ లాకింగ్ సిస్టమ్ వంటివన్నీ రైల్వే శాఖ అభివృద్ధి చేసినవే. వీటన్నింటిలోనూ ముఖ్యమైనది 'కవచ్'. 2011 12లో అమలులోకి వచ్చిన ట్రెయిన్ కొలీజన్ అవాయిడెన్స్ సిస్టమ్‌నే ఇప్పుడు కవచ్‌గా వ్యవహరిస్తున్నారు. రెడ్ సిగ్నల్ పడినప్పుడు రైలు ముందుకు వెళ్లకుండా ఉండటం, కవచ్ వ్యవస్థ కలిగి ఉన్న రెండు రైళ్లు ఢీకొనకుండా నివారించడం, అత్యవసర పరిస్థితుల్లో ఎస్ఒఎస్ మెస్సేజులు పంపించడం వంటివన్నీ పొందుపరచిన కవచ్‌ను.. రైలు ప్రమాదాల నివారణకు కచ్చితత్వంతో పనిచేసే వ్యవస్థగా చెప్పుకోవచ్చు. కానీ, ఈ విధానాన్ని అమలు చేయడంలో రైల్వే శాఖ ఉదాసీన వైఖరే ప్రమాదాలు పెచ్చుమీరడానికి కారణమవుతోంది. మన దేశంలో రైలు మార్గాల పొడవు 68 వేల కిలోమీటర్లయితే, ఇప్పటివరకూ కవచ్ ఏర్పాటైన దూరం 1455 కిలోమీటర్లు మాత్రమే. మరో మూడువేల కిలోమీటర్ల రైలు మార్గంలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి చేతులు దులుపుకునే రైల్వే మంత్రిత్వశాఖ ఇప్పటికైనా కళ్లు తెరవాలి. సౌకర్యాల లేమితో, తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలతో రైల్వే శాఖపై ప్రయాణికులలో పెరుగుతున్న అపనమ్మకానికి అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు చేపట్టడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం.